సమగ్ర తెలుగు దినపత్రిక

Website: www.adugunews.com

# అడుగు

The Step Towards The Truth..

హైదరాబాద్ | ఆదివారం 11 అక్టోబర్ 2026 | సంపుటి: 02 | సంచిక: 225 | పేజీలు: 4 | వెల: రూ.6:50

Published from Telangana, Andhra Pradesh | చీఫ్ ఎడిటర్: డాక్టర్ మార్గం లక్ష్మీనారాయణ | Mail: adugudaily@gmail.com

## రష్యాతో అమెరికా డీజిల్ ఒప్పందం

### పుతిన్‌తో ట్రంప్ చర్చలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 10(అడుగు న్యూస్): అంతర్జాతీయ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో జరిపిన చర్చలు ఫలించాయని, రష్యా నుంచి భారీగా డీజిల్‌ను కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు శుక్రవారం ప్రకటించారు. అయితే, ట్రంప్ నిర్ణయంపై ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది యుద్ధాన్ని పొడిగించేందుకు రష్యాకు నిధులు సమకూర్చడమేనని ఆయన ఆరోపించారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో తన చర్చలు అత్యంత విజయవంతంగా ముగిశాయని ట్రంప్ తెలిపారు. ఒప్పందం ప్రకారం రష్యా తక్షణమే 3 లక్షల

మిగతా 3లో..

## 'ఓటు చోరీ' ఆరోపణలను తిప్పికొట్టండి

### బీజేపీ శ్రేణులకు రాంచందర్ రావు పిలుపు

హైదారాబాద్, అక్టోబర్ 10(అడుగు న్యూస్): ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై కాంగ్రెస్ చేస్తున్న 'ఓటు చోరీ' ఆరోపణలను క్షేత్రస్థాయిలో బలంగా తిప్పికొట్టాలని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగానే ఎన్నికల కమిషన్ (ఈసీ) పారదర్శకంగా ఓటర్ల జాబితాను సిద్ధం చేసిందని ఆయన స్పష్టం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతలు, మీడియా ప్యానలిస్టులతో జరిగిన సమావేశంలో రాంచందర్ రావు మాట్లాడారు. దొంగ ఓట్ల

మిగతా 3లో..



# ఢిల్లీ రణరంగం

## జెన్ జీ పై ఉక్కుపాదం

- ఎక్కడికక్కడే నిర్బంధం
- సీజేపీ నిరసన యత్నం భగ్నం
- విమానంలోనే దీప్కే అరెస్టు
- అదుపులో 4గురు మాజీ సీఎంలు
- కొన్ని చోట్ల పోలీసులపై రాళ్ళు
- అదుపులో 7వేల మంది నిరసన కారులు
- ఢిల్లీకి వచ్చే 250 రైళ్ల రద్దు
- 45 మెట్రో స్టేషన్ల మూసివేత
- 30వేల మంది బలగాలు
- జెన్ జీలపై ప్రైవేట్ వ్యక్తుల దాడులు
- పట్టనట్లు చోద్యం చూసిన పోలీసులు
- సీజేపీ ప్లాన్ బీ ఉద్యమానికి అజింక్యా నాయకత్వం
- సీఈసీ రాజీనామా చేసేదాకా ఢిల్లిని వీడం : సీజేపీ
- విదేశీ శక్తులతో కలిసి సీజేపీ అరాచకం : బీజేపీ
- పోరాటం ఆపొద్దు..మేం మీ వెంటే : రాహుల్
- మళ్ళీ దీక్షకు దిగుతా : సోనంవాంగ్ చుక్
- దేశంలో సూపర్ ఎమర్జెన్సీ : మమత
- ఢిల్లీ నిర్బంధ కాండపై ఐరాస ఆందోళన
- ఢిల్లీలో రేపు ఇండీ కూటమి ప్రదర్శన

న్యూఢిల్లీ, అక్టోబర్ 10(అడుగు న్యూస్): దేశ రాజధాని ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిరసనల నేపథ్యంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, సభ్యులు సౌరవ్ దాస్, ఆశుతోష్ రాంకాలను అదుపులోకి తీసుకున్న కొద్దిసేపటికే ఆందోళనలు మరింత వేడెక్కాయి. కనాట్ ప్లేస్ ప్రాంతంలో ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా (పీటీఐ) కార్యాలయం సమీపంలో రాళ్లదాడి ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఓ పోలీసు సిబ్బంది గాయపడినట్లు సమాచారం. మరోవైపు, పార్టీ అగ్రనేతలు నిర్బంధంలో

మిగతా 2లో..



## ఇది డిక్టేటర్షిప్!

### కేంద్రంపై అభిజీత్ తీవ్ర విమర్శలు

### విడుదల చేయకపోతే నిరాహార దీక్ష

### సోనమ్ వాంగ్‌చుక్ వార్నింగ్

న్యూఢిల్లీ, అక్టోబర్ 10(అడుగు న్యూస్): సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేను దిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముంబయి నుంచి దిల్లీ విమానాశ్రయం చేరుకున్న ఆయన్ను విమానంలోనే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీప్కేతో పాటు సౌరవ్ దాస్, అశుతోశ్ రంకాను సైతం అదుపులోకి తీసుకున్నారు.

మిగతా 2లో..

## తగ్గేదేలే..

### ఎంతమంది బలగాలనైనా తెచ్చుకోండి

### సీజేపీ నిరసనలకు రాహుల్ మద్దతు

న్యూఢిల్లీ, అక్టోబర్ 10(అడుగు న్యూస్): కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీకి సవాల్ విసిరారు. నిరసనలు చేస్తున్న నాయకులు, యువత సహా ఎంతమందినైనా అరెస్టు చేసుకోవచ్చని అన్నారు. అయినా తమ పోరాటం ఆగదని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు.

మిగతా 2లో..

### రైతన్నా.. పంటలు

# వేయొద్దు

## రాబోయే 8 నెలలూ కీలకం

- ఎల్‌నినోతో తీవ్ర సంక్షోభం
- 215 మండలాల్లో వర్షాభావం
- వార్ రూం, టోల్ ఫ్రీ నెంబర్లు
- జూన్ వరకు కోవిడ్ తరహాలో యాక్షన్ ప్లాన్
- చుక్క నీరు కూడా వృథా కాకుండా చూడాలి
- విద్యుత్ కొరత రాకుండా ముందస్తు చర్యలు
- విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాలి
- ఖరీఫ్ పంటల రక్షణకు గ్రామ, రాష్ట్ర కమిటీలు
- జీరాంజీ ద్వారా ఉపాధి కల్పనకు ఏర్పాట్లు
- పేదలకుఅదనపు రేషన్ బియ్యం పంపిణీ
- 60-40 నిష్పత్తిలో రైతులకు ఆహారం
- ఎల్‌నినో పరిస్థితులపై సీఎం రేవంత్ సమీక్ష
- 12న మంత్రులతో సీఎం ప్రత్యేక సమావేశం
- కరవు మండలాలను వెంటనే గుర్తించండి
- కలెక్టర్లకు ముఖ్యమంత్రి కీలక ఆదేశాలు
- రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరిక



హైదారాబాద్, అక్టోబర్ 10(అడుగు న్యూస్): ఎల్‌నినో ప్రభావంతో రాబోయే రోజుల్లో తాగునీరు, సాగునీరు, వ్యవసాయం, విద్యుత్ రంగాల్లో తీవ్ర సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఈ సంక్షోభాన్ని ముందుగానే గుర్తించి, ఎదుర్కొనేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో పరిస్థితులు చేయిదాటకుండా పకడ్బందీ కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. శనివారం జూబ్లీహిల్స్‌లోని

మిగతా 3లో..

## హైదరాబాద్ నుంచి 3 బుల్లెట్ ట్రైన్ల కారిడార్లు

### అధ్యయన ప్రక్రియ పూర్తైన తర్వాత భూసేకరణ

### రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్‌తో కిషన్ రెడ్డి భేటీ



న్యూఢిల్లీ, అక్టోబర్ 10(అడుగు న్యూస్): భవిష్యత్తులో రానున్న బుల్లెట్ ట్రైన్లకు హైదరాబాద్ పెద్ద హబ్‌గా మారనుంది. ఎందుకంటే హైదరాబాద్ నుంచి ఏకంగా మూడు బుల్లెట్ ట్రైన్ల కారిడార్లను నిర్మించాలని రైల్వేశాఖ నిర్ణయం తీసుకుంది. ఇందులో హైదరాబాద్-చెన్నై, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-పుణె కారిడార్లు ఉన్నాయి. అయితే తాజాగా ఈ కారిడార్లకు సంబంధించి కీలక అప్డేట్ వచ్చింది. అలైన్‌మెంట్, భూసేకరణపై కేంద్రమంత్రులు అశ్విని వైష్ణవ్, కిషన్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. అలైన్‌మెంట్లపై అధ్యయనాలు జరుగుతున్నాయని, ఈ ప్రక్రియ పూర్తైన తర్వాత భూసేకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని స్పష్టం చేశారు.

మిగతా 2లో..

## సస్పెండైనా తీరు మారలే

### వెలుగులోకి 40 కోట్ల అక్రమార్జన

### 7 చోట్ల ఏసీబీ మెరుపు దాడులు



హైదారాబాద్, అక్టోబర్ 10(అడుగు న్యూస్): పేదల కడుపు నింపాల్సిన పౌర సరఫరాల శాఖలో ఉంటూ అక్రమార్జనతో అపర కుబేరుడిగా మారిన మహబూబాబాద్ జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ (డీఎం) వాసంశెట్టి నరసింహారావును అవినీతి నిరోధక శాఖ (అనిశా) అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారన్న పక్కా సమాచారంతో ఏకకాలంలో ఏడు చోట్ల సోదాలు నిర్వహించి, భారీగా అక్రమాస్తులను వెలికితీశారు. అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ రమేశ్ పర్యవేక్షణలో ఏడు ప్రత్యేక బృందాలు శుక్రవారం తెల్లవారుజాము నుంచే విస్తృత సోదాలు చేపట్టాయి. ఖమ్మంలోని నరసింహారావు స్వగృహంతో పాటు మహబూబాబాద్, నేలకొండపల్లి, గరిడేపల్లి, హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ సహా మొత్తం ఏడు కీలక ప్రాంతాల్లోని ఆయన బంధువులు, కుటుంబ సభ్యులు, బినామీల ఇళ్లపై ఏకకాలంలో

మిగతా 2లో..

**గుప్తానంతర యుగం (క్రీ.శ.550-750)**

అడుగు పోటీ పరీక్షల ప్రత్యేకం 5లో

అడుగు DIGITAL MEDIA పోటీ పరీక్షల ప్రత్యేకం

## పనామాలో భారీ భూకంపాలు

- వరుసగా రెండు సార్లు ప్రకంపనలు
- రిక్టర్ స్కేలుపై 7.7గా తీవ్రత నమోదు
- 9 దేశాలకు పొంచిఉన్న సునామీ ముప్పు!
- ఉత్తరాఖండ్‌లోనూ భూ ప్రకంపనలు
- ఉత్తరకాశీ జిల్లాలో రెండుసార్లు భూకంపం

న్యూఢిల్లీ, అక్టోబర్ 10(అడుగు న్యూస్): పనామాలో వరుసగా రెండు భారీ భూకంపాలు సంభవించాయి. తొలుత శుక్రవారం రిక్టర్ స్కేలుపై 7.7గా భూకంప తీవ్రత నమోదైంది. ఇది జరిగిన కొద్ది సేపటికే 6.6 తీవ్రతతో రెండో భూకంపం సంభవించిందని అమెరికా జియోలాజికల్ సర్వే తెలిపింది. ఈ భూకంప కేంద్రం, హెర్రెరా మధ్య ప్రావిన్స్‌లోని పిటలోజా



మిగతా 3లో..

## ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ

### రాష్ట్రంలో మొదలైన బతుకమ్మ సంబురాలు

### పూలను పేర్చి ఆటపాటలతో ఆడవాళ్ళ సందడి



హైదారాబాద్, అక్టోబర్ 10(అడుగు న్యూస్): రాష్ట్రంలో బతుకమ్మ సంబురాలు మొదలయ్యాయి. తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి వైభవంగా ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. రకరకాల పూలతో, సాంప్రదాయ దుస్తులతో మహిళలు, చిన్నారులు బతుకమ్మను పేర్చి ఆడిపాడారు. మహిళలు సహజసిద్ధమైన తీరొక్క పూలతో ఇంటింటా బతుకమ్మను పేర్చి పసుపు,

మిగతా 2లో..

## రేడియల్ రోడ్ 2 టెండర్లలో కుంభకోణం

### సీఎం రేవంత్ కు కేటీఆర్ బహిరంగ లేఖ

హైదారాబాద్, అక్టోబర్ 10(అడుగు న్యూస్): రేడియల్ రోడ్ 2 టెండర్లలో జరిగిన రూ. 3,296 కోట్ల కుంభకోణం పై సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి లేఖ రాశారు. అనేక ఆరోపణలకు తావిచ్చి వందల కోట్ల ప్రజల సొమ్ము వృథా చేస్తున్న ఈ టెండర్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్ఆర్ 2 టెండర్లపై పూర్తి వివరాలు బహిర్గతం చేయాలని, ప్రతి అనర్హతకు నిర్దిష్ట కారణాలను




మిగతా 2లో..

## ప్రజా తీర్పు పాలనలో ప్రతిబింబించాలి!

బెంగాల్‌లో బీజేపీ విజయాలు, తమిళనాడులో విజయ్ పార్టీ పురోగతి, పుదుచ్చేరిలో అధికార కూటమి గెలుపు ఆయా పార్టీలకు రాజకీయ ఊపునిచ్చాయి. కానీ ప్రజాభిమానాన్ని శాశ్వతంగా నిలబెట్టుకోవాలంటే గెలుపు గర్వాన్ని కాకుండా బాధ్యతను పెంచాలి. ప్రజల తీర్పును పాలనలో ప్రతిబింబించినప్పుడే ఎన్నికల విజయాలు నిజమైన ప్రజావిజయాలుగా మారతాయి.

**మార్గం - అడుగు**

ఎడిటోరియల్ 2వ పేజీలో..

సమగ్ర తెలుగు దినపత్రిక
అడుగు
The Step Towords The Truth..

# సంపాదకీయం
## మార్గం - అడుగు



## ప్రజా తీర్పు పాలనలో ప్రతిబింబించాలి!

ఎన్నికలు ఏవైనా ప్రజల నాడిని పట్టుకోవడంలో విజయం సాధించిన పార్టీలే రాజకీయంగా ముందంజలో నిలుస్తాయి. అధికారంలో ఉన్న, కొత్తగా వచ్చిన ప్రభుత్వాల పనితీరుకు, ప్రతిపక్షాల బలాబలాలకు ఉపఎన్నికలు ఒక పరీక్షగా నిలుస్తాయి. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, అస్సాం, పుదుచ్చేరిల్లో ఆరు స్థానాలకు జరిగిన ఉపఎన్నికల ఫలితాలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. బెంగాల్‌లో బీజేపీ భారీ విజయాలు సాధించగా, తమిళనాడులో ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) రెండు స్థానాలను కైవసం చేసుకుంది. పుదుచ్చేరిలో అధికార కూటమి తన పట్టును నిలబెట్టుకుంది. ఈ ఫలితాలు ఆయా ప్రాంతాల రాజకీయ సమీకరణాల్లో కొత్త చర్చకు తెరతీశాయి.

పశ్చిమ బెంగాల్‌లో నందిగ్రామ్, రెజీనగర్ స్థానాల్లో బీజేపీ సాధించిన విజయాలు ఆ పార్టీ రాజకీయ బలాన్ని చాటుతున్నాయి. నందిగ్రామ్‌లో బీజేపీ అభ్యర్థి హసిరాణి రథ్ కాంగ్రెస్ అభ్యర్థి మిలన్ ప్రధాన్‌పై 1,22,109 ఓట్ల భారీ ఆధిక్యంతో విజయం సాధించారు. ముస్లిం జనాభా అధికంగా ఉన్న రెజీనగర్‌లోనూ బీజేపీ అభ్యర్థి శంకరరావ్ సర్కార్ 75 వేల ఓట్ల ఆధిక్యంతో గెలుపొందడం విశేషం. మైనారిటీ జనాభా అధికంగా ఉన్న నియోజకవర్గంలో ఈ విజయం సాధించడం బీజేపీ విస్తరణ వ్యూహాలకు ప్రాధాన్యం పెంచింది.

రాష్ట్రంలో అధికార మార్పిడి అనంతరం జరిగిన ఈ ఉపఎన్నికల్లో బీజేపీకి లభించిన ప్రజామద్దతు ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. అయితే, ఓటర్లను బెదిరించారనే ఆరోపణలు, పోలింగ్ అక్రమాలపై వచ్చిన ఫిర్యాదులను తేలికగా తీసుకోరాదు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం నిలవాలంటే ఆరోపణలపై నిష్పాక్షిక విచారణ జరగాలి. భారీ మెజారిటీలు సాధించినంత మాత్రాన ప్రజల సమస్యలన్నీ పరిష్కారమైనట్లు కాదు. నిరుద్యోగం, ధరల పెరుగుదల, అభివృద్ధి, శాంతిభద్రతల విషయంలో ప్రభుత్వం తన పనితీరును నిరూపించుకోవాలి.

తమిళనాడులో టీవీకే సాధించిన రెండు విజయాలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ధరాపురంలో పి. సత్యభామ 66,841 ఓట్లు సాధించి 9,471 ఓట్ల ఆధిక్యంతో గెలిచారు. మధురాంతకంలో మరగతం కుమరవేల్ డీఎంకే అభ్యర్థిపై 20 వేల ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. గతంలో అన్నాడీఎంకే తరఫున గెలిచిన ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు రాజీనామా చేసి విజయ్ పార్టీలో చేరడంతో ఉపఎన్నికలు అనివార్యమయ్యాయి. తిరిగి అదే అభ్యర్థులను బరిలోకి దించిన టీవీకే విజయం సాధించడం పార్టీ నాయకత్వంపై ఉన్న రాజకీయ అంచనాలను పెంచింది.

ఈ విజయాలతో తమిళనాడు అసెంబ్లీలో టీవీకే బలం 107 నుంచి 109 స్థానాలకు పెరిగింది. అయితే, విజయ్ పార్టీకి లభించిన ఈ విజయాలను భారీ ప్రజాతీర్పుగా మాత్రమే కాకుండా, స్థానిక రాజకీయ పరిస్థితులు, అభ్యర్థుల ప్రభావం, పార్టీ మార్పుల నేపథ్యంలోనూ విశ్లేషించాలి. డీఎంకే, అన్నాడీఎంకేలకు ఈ ఫలితాలు ఆత్మపరిశీలనకు అవకాశం కల్పిస్తున్నాయి. రాజకీయాల్లో అనుభవం తక్కువగా ఉన్నప్పటికీ విజయ్ ప్రజాదరణను ఓట్లుగా మార్చుకోవడం గమనార్హం. ఇకపై ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, ఉపాధి, విద్య, వైద్యం, సంక్షేమ రంగాల్లో ఆయన ప్రభుత్వం సాధించే ఫలితాలే భవిష్యత్తు రాజకీయ విజయాలను నిర్ణయిస్తాయి.

అస్సాంలో నాగావ్ లోక్‌సభ ఉపఎన్నికలో బీజేపీ అభ్యర్థి దేవాశిష్ శర్మ విజయం సాధించడం ఆ పార్టీకి మరింత బలాన్నిచ్చింది. కాంగ్రెస్ ఎంపీ ప్రద్యుత్ బోర్దోలోయ్ రాజీనామా చేసి బీజేపీలో చేరి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడంతో ఈ స్థానం ఖాళీ అయింది. ఈ నేపథ్యంలో నాగావ్‌లో బీజేపీ విజయం సాధించడం ప్రతిపక్ష కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బగా చెప్పవచ్చు. పుదుచ్చేరిలో తట్టాంచావడి స్థానాన్ని ఎన్ఆర్ కాంగ్రెస్ అభ్యర్థి అశోక్ ఆనంద్ 8,474 ఓట్ల ఆధిక్యంతో గెలుచుకోవడం ముఖ్యమంత్రి ఎన్. రంగసామి నేతృత్వంలోని అధికార కూటమికి ఊరటనిచ్చింది.

ఈ ఉపఎన్నికల ఫలితాలు బీజేపీ బలపడుతున్న సంకేతాలను ఇస్తున్నప్పటికీ, కొన్ని స్థానాల ఫలితాలతో దేశవ్యాప్త రాజకీయ ధోరణిని నిర్ధారించడం సరికాదు. ప్రధాని నరేంద్ర మోదీ ఈ విజయాలపై హర్షం వ్యక్తం చేస్తూ, ఎన్డీయే సుపరిపాలనపై ప్రజలకు ఉన్న విశ్వాసానికి ఇవి నిదర్శనమని పేర్కొన్నారు. అయితే, ప్రజాస్వామ్యంలో ఎన్నికల విజయం ఆరంభం మాత్రమే. ప్రజా సమస్యల పరిష్కారం, పారదర్శక పాలన, సామాజిక న్యాయం, సంక్షేమ పథకాల అమలే ప్రభుత్వాల విశ్వసనీయతకు గీటురాళ్లు.

మొత్తంగా, బెంగాల్‌లో బీజేపీ విజయాలు, తమిళనాడులో విజయ్ పార్టీ పురోగతి, పుదుచ్చేరిలో అధికార కూటమి గెలుపు ఆయా పార్టీలకు రాజకీయ ఊపునిచ్చాయి. కానీ ప్రజాభిమానాన్ని శాశ్వతంగా నిలబెట్టుకోవాలంటే గెలుపు గర్వాన్ని కాకుండా బాధ్యతను పెంచాలి. ప్రజల తీర్పును పాలనలో ప్రతిబింబించినప్పుడే ఎన్నికల విజయాలు నిజమైన ప్రజావిజయాలుగా మారతాయి.

# ఢిల్లీ నిరసనలపై కేంద్రం ఆంక్షలు..

### మెట్రో మూసివేతపై కోర్టు ధిక్కరణ పిటిషన్
### ఉన్నతాధికారులపై చర్యలకు డిమాండ్
### నిరసనకారుల నిర్బంధంపైనా పిటిషన్
### ప్రజా రవాణా పూర్తిగా నిలిపివేయొద్దు: సుప్రీం

న్యూఢిల్లీ, అక్టోబర్ 10(అడుగు న్యూస్): ఢిల్లీలో నిరసనల నేపథ్యంలో మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల రద్దుపై సుప్రీంకోర్టు కీలకంగా స్పందించింది. ఈ నెల 9న ఇచ్చిన ఆదేశాలను అధికారులు ఉల్లంఘించారంటూ దాఖలైన పిటిషన్‌పై ఆదివారం ప్రత్యేకంగా విచారణ చేపట్టనుంది. నిరసనల సమయంలో ప్రజా రవాణాను పూర్తిగా నిలిపివేయకూడదని కోర్టు స్పష్టం చేసినప్పటికీ.. ఆంక్షలు కొనసాగించారన్నది పిటిషనర్ ఆరోపణ. జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనతో కూడిన ప్రత్యేక ధర్మాసనం ఈ కేసును విచారించనుంది. న్యాయవాది శైలేంద్ర మణి త్రిపాఠి దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌తో పాటు, నిరసనల సమయంలో పలువురిని నిర్బంధించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన మరో పిటిషన్‌నూ ధర్మాసనం పరిశీలించనుంది. ఢిల్లీలో శనివారం జరిగిన నిరసనల సందర్భంగా ప్రతిపక్ష నేతలను ముందస్తుగా నిర్బంధించడాన్ని సవాలు చేస్తూ తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ, సీనియర్ న్యాయవాది మేనకా గురుస్వామి హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. నలుగురు మాజీ ముఖ్యమంత్రులు సహా ప్రతిపక్ష నేతలను నిర్బంధించడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. శాంతియుతంగా నిరసన తెలిపే ప్రాథమిక హక్కును అణచివేయడానికి ముందస్తు నిర్బంధాన్ని ఉపయోగించకూడదని ఆమె వాదించారు. నిరసనకారులను రోడ్లపై నుంచి, ప్రతిపక్ష నేతలను వారి ఇళ్ల నుంచి పోలీసులు తీసుకెళ్లడంపైనా ప్రశ్నించారు. కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్, ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్, ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (డీఎంఆర్సీ) ఛైర్‌పర్సన్ డి.థారాపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని త్రిపాఠి కోరారు. సుప్రీంకోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా పట్టించుకోలేదని ఆరోపించారు. మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల రద్దు కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే, ఈ ఆరోపణలపై కోర్టు ఇంకా ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదు. ఢిల్లీలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టనున్న నేపథ్యంలో 57 మెట్రో స్టేషన్లను మూసివేయాలని ఢిల్లీ పోలీసులు సూచించారు. న్యూఢిల్లీ, హజ్రత్ నిజాముద్దీన్ రైల్వే స్టేషన్లకు వచ్చే మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లపైనా ఆంక్షలు విధించారు. ఆ తర్వాత డీఎంఆర్సీ మూసివేతల సంఖ్యను 45కి తగ్గించింది. ఈ ఆంక్షలపై విచారణ సందర్భంగా ప్రజా రవాణాను పూర్తిగా నిలిపివేయడం సరికాదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. భద్రతా అవసరాలను దృష్టిలో పెట్టుకుని సేవలను నియంత్రించవచ్చని, కానీ పూర్తిగా నిషేధించకూడదని స్పష్టం చేసింది. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ముందుగానే ట్రాఫిక్ సూచనలు ఇవ్వాలని, శాంతియుత నిరసనలకు తగిన సౌకర్యాలున్న ప్రత్యామ్నాయ ప్రాంతాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించింది. ఆ ఆదేశాలు అమలయ్యాయా లేదా అన్నది ఆదివారం విచారణలో కీలకంగా మారనుంది.

# ఢిల్లీ రణరంగం

**మొదటిపేజీ తరువాయి..**

ఉండటంతో నిరసనలకు నాయకత్వం వహించే బాధ్యతను సంస్థాగత వ్యవహారాల ఇన్‌ఛార్జి అజింక్య శిందేకు అప్పగించినట్లు వెల్లడైంది. ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి అదుపులోకి తీసుకున్న అనంతరం అభిజీత్ దీప్కే, సౌరవ్ దాస్, ఆశుతోష్ రాంకాలను



గుర్తుతెలియని ప్రాంతానికి తరలించినట్లు సీజేపీ ఎక్స్ వేదికగా తెలిపింది. నిర్బంధంలో ఉన్న తమ నాయకులకు న్యాయవాదులను కలిసే అవకాశం ఇవ్వడం లేదని, ఇతరులతో సంప్రదింపులు జరపకుండా అడ్డుకుంటున్నారని పార్టీ ఆరోపించింది. ఇలాంటి పరిస్థితుల్లో అత్యవసర పరిస్థితిని ప్రకటించకుండా ఎందుకు ఉన్నారంటూ తన పోస్టులో ప్రశ్నించింది. నిరసనల దృష్ట్యా ఢిల్లీ సరిహద్దుల్లో భద్రతను పెంచారు. రాజధానిలోకి ప్రవేశించే వాహనాలను తనిఖీ చేస్తూ, వాటిపై నిఘా కొనసాగిస్తున్నారు. హోటళ్లు, అతిథి గృహాలు, వసతి గృహాలు, ధర్మశాలల్లో పోలీసులు తనిఖీలు చేపడుతున్నారు. బస్సు టెర్మినళ్లు, ఇతర రవాణా కేంద్రాల వద్ద కూడా అప్రమత్తత పెంచారు. సామాజిక మాధ్యమాలపై నిఘా ముమ్మరం చేయడంతో పాటు, నిరసనల కోసం జన సమీకరణకు సంబంధించి 200 మందికి పైగా కంటెంట్ సృష్టికర్తలను విచారణ పరిధిలోకి తీసుకున్నట్లు సమాచారం. ముందస్తు జాగ్రత్తగా శనివారం ఢిల్లీ అంతటా మద్యం దుకాణాలను మూసివేయనున్నారు. అనవసర ప్రయాణాలు మానుకోవాలని పోలీసులు ప్రజలకు సూచించారు.ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై సీజేపీ ఆరోపణలు చేస్తోంది. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పేరుతో జాబితాల్లో అవకతవకలకు పాల్పడుతున్నారని, ఓటరు నమోదు పత్రం ఫారం-6లో మార్పులపై ఇద్దరు సహాయ ఎన్నికల కమిషనర్లు వ్యక్తం చేసిన అభ్యంతరాలను పక్కనపెట్టారని ఆరోపిస్తోంది. ఈ అంశాలపై ప్రశ్నించేందుకే నిరసనలు చేపడుతున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తన నివాసం నుంచి జంతర్‌మంతర్‌కు బయలుదేరగా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఈ సమయంలో ఆప్ కార్యకర్తలు పోలీసులను అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు కేజ్రీవాల్‌ను ఎత్తుకుని బస్సు వద్దకు తీసుకెళ్లారు. ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, దిల్లీ పార్టీ విభాగం అధ్యక్షుడు సౌరభ్ భరద్వాజ్ సహా పలువురు నేతలను కూడా అదుపులోకి తీసుకున్నారు.ఈ సందర్భంగా కేజ్రీవాల్ మాట్లాడుతూ, ఎన్నికల్లో ఓట్ల చోరీ జరుగుతోందని ప్రధాని మోదీపై ఆరోపణలు చేశారు. దేశ యువత మేల్కొందని, అన్యాయానికి భయపడబోరని అన్నారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని సౌత్ అవెన్యూ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జంతర్‌మంతర్‌కు వెళ్లకుండా అడ్డుకోవడంతో ఆమె పార్టీ నేతలతో కలిసి అక్కడే బైఠాయించారు. ఈ నిరసనలో డెరెక్ ఓబ్రియన్, దోలా సేన్ సహా పలువురు తృణమూల్ నేతలు పాల్గొన్నారు. మమతా బెనర్జీ నోటికి బ్యాండేజ్ వేసుకుని నిరసన తెలిపారు. దేశంలో పరిస్థితి ఎమర్జెన్సీని మించిపోయిందని, ఇది సూపర్ ఎమర్జెన్సీలా ఉందని ఆమె విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని, దేశాన్ని కాపాడాలన్నదే తమ సందేశమని పేర్కొన్నారు. రళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, త్రిపుర మాజీ సీఎం మాణిక్ సర్కార్, సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీ, వామపక్ష నేత బృందా కారత్‌లను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేరళ భవన్ బయట నుంచి జంతర్‌మంతర్‌కు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో వారిని అడ్డుకున్నారు. పోలీసుల చర్యకు వ్యతిరేకంగా నేతలు నినాదాలు చేశారు. విజయన్ ఈ ఘటనపై సామాజిక మాధ్యమం ఎక్స్‌లో స్పందించారు. ప్రతిపక్ష నేతలను చూసి భయపడుతున్నందుకే పోలీసులు ప్రజాప్రతినిధులను అదుపులోకి తీసుకుని, గంటపాటు వాహనాల్లో తిప్పారని విమర్శించారు.ప్రజాస్వామ్య హక్కులపై ఇలాంటి చర్యలతో తమను భయపెట్టలేరని పేర్కొన్నారు. సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, సామాజిక కార్యకర్త యోగేంద్ర యాదవ్, సుప్రీంకోర్టు న్యాయవాది ప్రశాంత్ భూషణ్‌లను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దిల్లీని పోలీసు శిబిరంగా మార్చినప్పటికీ నిరసనల్లో పాల్గొనేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చారని దీపాంకర్ భట్టాచార్య అన్నారు. ఒక ప్రాంతంలో నిరసనను అడ్డుకున్నా, ఉద్యమ స్ఫూర్తిని ఆపలేరని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో భారీ భద్రతా ఏర్పాట్లు, ఆంక్షలపై కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. నగరంలో ప్రతి కొన్ని వందల మీటర్లకో తనిఖీ కేంద్రం, కాంక్రీట్ బారికేడ్లు, రోడ్లపై ముళ్ల అడ్డంకులు కనిపిస్తున్నాయని ఎక్స్‌లో పేర్కొన్నారు. సుమారు 22 వేల మంది పోలీసులు, పారామిలటరీ సిబ్బందిని మోహరించారని, 250 రైళ్లు రద్దయ్యాయని, 45 మెట్రో స్టేషన్లు మూసివేశారని ఆయన ఆరోపించారు. యువకులను ఇళ్ల నుంచి, వీధుల నుంచి అదుపులోకి తీసుకుంటున్నారనే వార్తలను కూడా ప్రస్తావించారు. రాజధాని నడిబొడ్డున ఇంటర్నెట్ నిలిపివేయడం, జంతర్ మంతర్‌కు వెళ్లే మార్గాలను మూసివేయడం ప్రజల స్వేచ్ఛను పరిమితం చేయడమేనని వ్యాఖ్యానించారు. ఎన్నికల సంఘంపై ప్రజలకు ఉన్న సందేహాలకు సమాధానాలు ఇవ్వడం ద్వారానే ప్రశాంతతను పునరుద్ధరించవచ్చని అన్నారు.

# ఇది డిక్టేటర్షిప్!

**మొదటిపేజీ తరువాయి..**

దీనికి సంబంధించిన ఓ వీడియోను సీజేపీ మాధ్యమాల్లో పోస్టు చేసింది. మోదీ ప్రభుత్వం నియంతృత్వ పోకడతో ప్రవర్తిస్తోందని, ఇది డిక్టేటర్‌షిప్ అని అభిజీత్ దీప్కే విమర్శించారు. మోదీ నియంతలా వ్యవహరిస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. జెన్ జీ అంటే ప్రధాని మోదీకి ఎందుకంత భయమో అర్థం కావడం లేదని అన్నారు. రైళ్లు, మెట్రో సేవలను నిలిపివేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. ఆర్టికల్ 19 ప్రకారం ప్రజాస్వామ్య, శాంతియుత మార్గంలో ఆందోళన చేసే హక్కు తమకుందని అన్నారు. అరెస్టుకు సిద్ధంగా ఉన్నామని, తమపై ఉపా, ఎన్ఎస్ఏ లాంటి చట్టాలు ప్రయోగించినా లెక్కచేయమని తేల్చి చెప్పారు. దేశంలో స్వేచ్ఛాయుత, పారదర్శక ఎన్నికల కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. తాము అరెస్టు కావడానికి వచ్చామని, తమను అరెస్టు చేయండని దీప్కే పోలీసులతో అన్నట్లు వీడియోలో ఉంది. దీప్కే సహా ఇతర నేతల నిర్బంధాన్ని సీజేపీ తీవ్రంగా ఖండించింది. జంతర్‌మంతర్ వద్దకు తమ నేతలు వెళ్లకుండా ముందస్తు ప్రణాళిక ప్రకారం తమ నేతలను అదుపులోకి తీసుకున్నారని ఆరోపించింది. ఇది పౌర హక్కుల ఉల్లంఘన అని మండిపడింది. అదుపులోకి తీసుకున్న తమ ముగ్గురు నేతలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేసింది. అటు దిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయ పరిసరాల్లో భారీగా కేంద్ర బలగాలను మోహరించారు. సర్ ప్రక్రియలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ, కేంద్ర ఎన్నికల సంఘం తీరుకు నిరసనగా దిల్లీలో శనివారం జంతర్ మంతర్ 2.వా పేరుతో ప్రతిపక్షాలు, కాక్రోచ్ జనతా పార్టీ నిర్వహించిన ఆందోళన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. అనుమతి లేదనే కారణంతో దిల్లీ పోలీసులు దాదాపు 7000 మంది నిరసనకారులను, సీజేపీ నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలోనే సీజేపీ, ప్రతిపక్ష నేతలు చేపట్టిన నిరసనలపై పోలీసుల చర్యలను ప్రముఖ సామాజిక కార్యకర్త, విద్యావేత్త సోనమ్ వాంగ్‌చుక్ తీవ్రంగా విమర్శించారు.



నిరసనల్లో అరెస్ట్ అయిన సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే సహా ఇతరులను ఆదివారం నాటికి విడుదల చేయకపోతే తాను నిరాహార దీక్ష లేదా పాదయాత్ర చేపట్టాల్సి వస్తుందని, ఆ విషయాన్ని పరిశీలిస్తానని హెచ్చరించారు. దేశంలో ప్రస్తుతం అప్రకటిత ఎమర్జెన్సీ (అన్‌డిక్లేర్డ్ ఎమర్జెన్సీ) పరిస్థితులు నెలకొన్నాయని ఆయన వ్యాఖ్యానించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అవకతవకలు జరిగాయని, దీనిపై చర్యలు తీసుకోవాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ అక్టోబర్ 10న దిల్లీ జంతర్ మంతర్ వద్ద సీజేపీ నిరసనలకు పిలుపునిచ్చింది. అయితే ఇక్కడ దిల్లీ పోలీసులు అనుమతి నిరాకరించడంతో రాజధానిలో ఉద్రిక్తత నెలకొంది. ఈ క్రమంలోనే నిరసనకు తాను హాజరుకాకపోవడంపై గతంలో ఇచ్చిన వివరణను వాంగ్‌చుక్ తాజాగా ప్రస్తావించారు. శుక్రవారం తాను శాంతి, ఐక్యతతో నిరసన నిర్వహించాలని కోరానని, అయితే ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో ఇలాంటి పరిస్థితి ఏర్పడుతుందని అప్పుడు ఊహించలేదని అన్నారు. 'దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ పరిస్థితులు నెలకొన్నాయి' అని వాంగ్‌చుక్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. నిరసనకారుల్ని పెద్ద సంఖ్యలో అదుపులోకి తీసుకోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే వారిని రేపటిలోగా విడుదల చేయాలని హెచ్చరించారు. తకుముందు నీట్ యూజీ 2026 పేపర్ లీక్ సమయంలో జంతర్ మంతర్ వద్ద చేపట్టిన నిరసనలో వాంగ్‌చుక్ సీజేపీ ముఖచిత్రంగా నిలిచారు. అప్పట్లో వాంగ్‌చుక్ 21 రోజుల పాటు నిరాహార దీక్ష చేపట్టారు. జులై 20న భారీ పాదయాత్ర జరగ్గా, ఆరోగ్యం క్షీణించగా ఆస్పత్రిలో చేరిన ఆయన జులై 23న దీక్ష విరమించారు. అనంతరం జులై 25న ధర్మేంద్ర ప్రధాన్ కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేశారు.ఇదిలా ఉండగా ప్రస్తుత నిరసనల్లో పాల్గొనకపోవడానికి కారణాల్ని గతంలోనే వాంగ్‌చుక్ వివరించారు. లద్దాఖ్‌లో తనకు ఇతర ముఖ్యమైన పనులు ఉన్నాయని తెలిపారు. కృత్రిమ హిమనీనదాలు నిర్మాణం, గ్లేసియర్ల వల్ల సరస్సులు ఉప్పొంగి వరదలు సంభవించే ప్రమాదాల్ని తగ్గించడానికి సంబంధించి ప్రయోగాలు చేస్తున్నట్లు వివరించారు. హిమాలయాల్లో ప్రమాదకరంగా మారే అవకాశం ఉన్న 200కుపైగా హిమసరస్సుల ముప్పును తగ్గించడమే తమ లక్ష్యమని తెలిపారు.

# ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ

**మొదటిపేజీ తరువాయి..**

కుంకుమలతో గౌరమ్మను చేసి భక్తిశ్రద్ధలతో కొలుస్తారు. తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మ ఆ తర్వాత వరుసగా అటుకుల బతుకమ్మ, ముద్ద పప్పు బతుకమ్మ, నానబియ్యం బతుకమ్మ, అట్ల బతుకమ్మ, అలిగిన బతుకమ్మ, వేపకాయల బతుకమ్మ, వెన్నముద్దల బతుకమ్మ ఉత్సవాలు జరుగుతాయి. ఇలా రోజుకొక్క పేర్లతో పిలుచుకుంటూ బతుకమ్మలు తయారు చేసి గౌరీ దేవికీ రోజుకొక రకంగా పిండివంటలు నైవేద్యంగా సమర్పిస్తారు. చివరిరోజు సద్దుల బతుకమ్మను రాష్ట్ర వ్యాప్తంగా అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. తంగేడు, గునుగు, కట్ల, గుమ్మడి మొదలైన పూలతో చేసిన బతకుమ్మలు నేటి నుంచి ఇంటింటా కనువిందు చేస్తాయ్. పెళ్లైన పడతులు పుట్టింటికి వచ్చి ఆనందంగా జరుపుకునే పండుగ ఇది. ఇళ్ల ముంగిళ్లలోనూ ఆలయాలు కూడళ్ల వద్దా, చెరువు గట్టల వద్దా బతుకమ్మలను ఒక్క చోటుకు చేర్చి పాటలు పాడి నృత్యాలు చేస్తారుహైదరాబాద్‌లోని రవీంద్రభారతి, శిల్పారామంతో పాటు వరంగల్, హనుమకొండ, సంగారెడ్డి, మెదక్, కరీంనగర్ తదితర చోట్ల పెద్ద సంఖ్యలో మహిళలు, చిన్నారులు ఒక్క చోట చేరి తీరొక్క పూలతో బతుకమ్మను అందంగా పేర్చి చప్పట్లు కొడుతూ చుట్టూ తిరుగుతూ ఆడి పాడారు. బతుకమ్మ నిర్వహణ కోసం పురపాలక, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. పండగ జరిగే ప్రాంతాలు, ఘాట్లు, మైదానాలకు వెళ్లే రహదారుల మరమ్మతుతో పాటు విద్యుత్, తాగునీరు అందుబాటులో ఉంచారు. మెదక్ జిల్లాలో పలు గ్రామాలలో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీ కోదండ రామాలయం, బాలాజీ మఠం, హౌసింగ్ బోర్డు తదితర కాలనీల్లో మహిళలు, చిన్నారులు సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, వాటి చుట్టూ చేరి బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా ఆడి పాడారు.

కాగా భాద్రపదమాసం అమావాస్య తో మొదలయ్యే బతుకమ్మ పండుగ ఆశ్వయుజమాసం అష్టమితో ముగుస్తుంది. తొమ్మిది రోజుల పాటూ వైభవంగా సాగే పూల పండుగలో ఏ రోజు ఏ బతుకమ్మను పూజిస్తారు, ఏ నైవేద్యం సమర్పిస్తారు.

# హైదరాబాద్ నుంచి 3 బుల్లెట్ ట్రైన్ల కారిడార్లు

**మొదటిపేజీ తరువాయి..**

ఇప్పటివరకు భూసేకరణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వాలకు ఎలాంటి ప్రతిపాదనలు పంపలేదని తెలిపారు. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే తన ఎక్స్‌లో కేంద్రమంత్రుల భేటీకి సంబంధించి ఒక పోస్ట్ చేసింది. ఢిల్లీలో రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో కిషన్ రెడ్డి తాజాగా భేటీ అయ్యారు. హైదరాబాద్ నుంచి బుల్లెట్ ట్రైన్ల ప్రాజెక్టులపై ప్రధానంగా చర్చించారు. హైదరాబాద్ నుంచి చెన్నై, బెంగళూరు, ముంబైలకు కనెక్టివిటీ కల్పిస్తూ ప్రతిపాదించిన హైస్పీడ్ బుల్లెట్ రైళ్ల కారిడార్లకు సంబంధించి అలైన్‌మెంట్లపై చర్చించారు. ఈ సందర్భంగా అలైన్‌మెంట్ ఖరారు కోసం చర్యలు తీసుకుంటామని, ఆ తర్వాత భూసేకరణ ప్రారంభమవుతుందని అశ్విని వైష్ణవ్ తెలిపారు. అలైన్‌మెంట్ ఫిక్స్ అయిన తర్వాత భూసేకరణ చేపడతామని స్పష్టం చేశారు. ప్రతిపాదనలు లేకుండా భూసేకరణ చేపట్టడం చట్టవిరుద్ధమని, హైస్పీడ్ బుల్లెట్ ట్రైన్ పేరుతో ఎవరైనా భూమిని సేకరిస్తే అది ఉల్లంఘన కిందకు వస్తుందన్నారు. అలైన్‌మెంట్ ఫిక్స్ అయిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రతిపాదనలు పంపుతామని పేర్కొన్నారు. అయితే బుల్లెట్ ట్రైన్ మార్గానికి సంబంధించి పొలాల్లో మార్కింగ్ పనులు చేపట్టడంతో రైతులు ఆందోళనలు చేపడుతున్నారు. భూములు కోల్పోతామోనని రైతులు భయాందోళనకు గురవుతున్నారు. అంతేకాకుండా అలైన్‌మెంట్, మార్కింగ్ ప్రక్రియపై స్పష్టత లేకపోవడంతో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయాన్ని రైల్వేశాఖ మంత్రి దృష్టికి కిషన్ రెడ్డి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా అలైన్‌మెంట్ ఖరారు అయిన తర్వాత ప్రభుత్వాలు, రైతులకు పూర్తి సమాచారం అందిస్తామని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అశ్విని వైష్ణవ్ తెలిపారు. అటు సూర్యాపేట మీదుగా బుల్లెట్ రైలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ప్రాథమికంగా రూపొందించిన అలైన్‌మెంట్‌లో సూర్యాపేటను చేర్చినప్పటికీ.. ఆ తర్వాత మార్పులు చోటుచేసుకున్న విషయాన్ని రైల్వేశాఖ మంత్రికి కిషన్ రెడ్డి వివరించారు. కాగా హైదరాబాద్-చెన్నై, హైదరాబాద్-బెంగళూరు బుల్లెట్ రైలు కారిడార్ ఏపీ మీదుగా వెళ్లనుంది. దీంతో ఏపీ ప్రజలకు కూడా ప్రయోజనం చేకూరనుంది.

# సస్పెండైనా తీరు మారలే

**మొదటిపేజీ తరువాయి..**

దాడులు జరిగాయి. ఈ తనిఖీల్లో వెలుగుచూసిన ఆస్తుల పత్రాలు, విలువైన వస్తువులను చూసి అధికారులే విస్తుపోయారు. అధికారిక లెక్కల ప్రకారం ప్రభుత్వ రిజిస్ట్రేషన్ విలువే రూ.9.41 కోట్లుగా తేలగా, బహిరంగ మార్కెట్లో దీని విలువ సుమారు రూ.40 కోట్లకు పైగా ఉంటుందని అనిశా అధికారులు అంచనా వేశారు. సోదాల్లో భాగంగా ఒక ఖరీదైన కారు, 331.58 గ్రాముల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, అలాగే రూ.15,600 నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో బయటపడిన స్థిరాస్తుల చిట్టా భారీ స్థాయిలో ఉంది. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం బల్లెపల్లి, వెలుగుమట్ల ప్రాంతాల్లో మొత్తం 1,230.16 చదరపు గజాల విస్తీర్ణంలో 5 నివాస స్థలాలు ఉన్నాయి. ఖమ్మం నగరంలో జీ౦2, జీ౦4 బహుళ అంతస్తుల భారీ భవనాలు నిర్మించగా, హైదరాబాద్ నగర శివారులోని ఎల్బీనగర్ బైరామల్‌గూడలో మరో జీ౦2 విలాసవంతమైన భవనం ఉన్నట్లు గుర్తించారు. సూర్యాపేట జిల్లా మోతె మండలం సిరికొండ పరిధిలో ఏకంగా 21.30 ఎకరాలు, నామవరం పరిధిలో 5.31 ఎకరాలు, అలాగే గరిడేపల్లి మండలం కల్మలచెరువులో 1.08 ఎకరాల వ్యవసాయ భూములను కొనుగోలు చేసినట్లు పత్రాలు లభ్యమయ్యాయి. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలానికి చెందిన నరసింహారావు 2011లో సివిల్ సప్లైస్ సంస్థలో విధుల్లో చేరారు. గత ఆరు నెలల నుంచి ఆయన మహబూబాబాద్ జిల్లాలో అసిస్టెంట్ టెక్నికల్ మేనేజర్, జిల్లా మేనేజర్ (డీఎం) బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. అయితే గతంలో ఖమ్మం, నిర్మల్, వరంగల్ జిల్లాల్లో పని చేసిన సమయంలోనూ ఆయనపై పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాల ఆరోపణలు వెల్లువెత్తాయి. విధి నిర్వహణలో తీవ్ర అక్రమాలకు పాల్పడటంతో గతంలోనే ఉన్నతాధికారులు ఆయనను రెండుసార్లు ఉద్యోగం నుంచి సస్పెండ్ కూడా చేశారు. అయినప్పటికీ ఆయన తన అవినీతి దందాను ఆపలేదు. తాజాగా బాధితులు, సమాచారకర్తల నుంచి బలమైన ఆధారాలతో ఫిర్యాదులు రావడంతో ఏసీబీ పక్కా వ్యూహంతో వలపన్నింది. ఈ తనిఖీల్లో నరసింహారావుతో పాటు ఆయన భార్య, మామ పేర్ల మీద, ఇతర బినామీల పేర్ల మీద పెద్ద ఎత్తున స్థిర, చరాస్తులను కూడబెట్టినట్లు వెల్లడైంది. నిందితుడైన డీఎం వాసంశెట్టి నరసింహారావును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ రమేశ్ తెలిపారు. ఈ అక్రమాల్లో భాగస్వాములైన బినామీలు, ఇతర సహకారులపైనా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని అనిశా అధికారులు హెచ్చరించారు.

# రేడియల్ రోడ్ 2 టెండర్లలో కుంభకోణం

**మొదటిపేజీ తరువాయి..**

పేర్కొంటూ సాంకేతిక మూల్యాంకన నివేదికను విడుదల చేయాలని సూచించారు. మూడు ప్యాకేజీల ఆర్థిక వివరాలను వెల్లడించాలని, అంచనా వ్యయాలు, తుది కేటాయింపు విలువలు, అర్హత సాధించిన ప్రతి బిడ్డర్ ఆర్థిక బిడ్ వివరాలను విడుదల చేయాలని కోరారు. రూ.600 కోట్ల ఆర్థిక నష్టం ఆరోపణపై సమగ్ర విచారణ జరపాలని, ధరల వ్యత్యాసాలు, బిడ్ల వివరాలు, తుది కేటాయింపులపై పూర్తిస్థాయి పరిశీలన జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలన్నారు. గత మూడేళ్లలోని భారీ కాంట్రాక్టులపై కాగ్ ప్రత్యేక ఆడిట్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, హెచ్ఎండీఏ, హెచ్‌జీసీఎల్ చేపట్టిన రూ.100 కోట్లకు పైబడిన కాంట్రాక్టులపై ఆడిట్ జరిపించాలని డిమాండ్ చేశారు. టెండర్లపై శ్వేతపత్రం విడుదల చేయాలలని వెల్లడించారు. టెండర్ల ప్రక్రియలో పారదర్శకతకు స్పష్టమైన నిబంధనలు రూపొందించాలని ,సాంకేతిక అర్హతలపై నిర్ణయాలు తీసుకునే విధానం, బిడ్డర్లు వివరణ ఇచ్చేందుకు కల్పించే అవకాశం, సాంకేతిక ఫలితాలు ప్రకటించిన తర్వాత ఆర్థిక బిడ్లు తెరవడానికి అనుసరించే వ్యవధిపై స్పష్టమైన నిబంధనలు అమలు చేయాలని కేటీఆర్ సీఎంను డిమాండ్ చేశారు.

# తగ్గేదేలే..

**మొదటిపేజీ తరువాయి..**

గత పదేళ్లకు పైగా ప్రధాని మోదీ, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్)తో తాను పోరాడుతున్నానని పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఎక్స్ వేదికగా ఓ వీడియోను విడుదల చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దిల్లీలో నిరసనలు జరుగుతున్న నేపథ్యంలో రాహుల్ ఆ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. నిరసనల్లో పాల్గొంటున్న యువతకు మద్దతు ప్రకటించిన ఆయన, ఆందోళనలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగంపై దాడి చేసిన వారిని ఓడించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని చెప్పారు. ప్రధాని మోదీ, ఆరెస్సెస్‌తో తనకు సుదీర్ఘకాలంగా రాజకీయ పోరాటం కొనసాగుతోందని రాహుల్ గాంధీ చెప్పారు. ప్రత్యర్థుల ఆలోచనా విధానాన్ని పూర్తిగా అర్థం చేసుకున్నానని పేర్కొన్నారు. మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్‌ల పేర్లను ప్రస్తావించారు. వీరికి రాజకీయంగా పరిస్థితులు కష్టంగా మారుతున్నాయని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం నిరసనలను అడ్డుకునేందుకు పోలీసులను రంగంలోకి దించినా తమ పోరాటం ఆగదని రాహుల్ అన్నారు. ""మోదీ జీ మీకు నచ్చినట్లు చేసుకోండి. 10 వేల మంది, 20 వేల మంది, 50 వేల మంది పోలీసులను రంగంలోకి దించండి. నాయకులను అరెస్టు చేయండి. యువతను అరెస్టు చేయండి. మమ్మల్ని అందరినీ అరెస్టు చేయండి. అయినా మేం వెనక్కి తగ్గబోం" అని స్పష్టం చేశారు. తమ వద్ద ఇప్పటికే అవసరమైన సమాచారం ఉందని రాహుల్ పేర్కొన్నారు. దేశ రాజ్యాంగాన్ని కాపాడటంతోపాటు ప్రజల గొంతుకను రక్షించేందుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. గత పదేళ్ల నుంచి 15 ఏళ్ల కాలంలో దేశానికి జరిగిన నష్టం మళ్లీ జరగకుండా చూస్తామని అన్నారు. రాజ్యాంగంపై దాడి చేసిన వారిని, ప్రస్తుత ప్రభుత్వాన్ని ఓడించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు.

అడుగు
The Step Towords The Truth..

# బతుకమ్మ పాట విడుదల

హైదరాబాద్, అక్టోబర్ 10 (అడుగు న్యూస్): హైదరాబాద్, నందీనగర్‌లో తెలంగాణ రక్షణ సమితి పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత 'సిరిసిరి మువ్వల సిరుల బతుకమ్మ' పాట సీడీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,



బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, పూలను దేవతలుగా పూజించే గొప్ప సంప్రదాయం తెలంగాణకే సొంతమని అన్నారు. తెలంగాణ ఆడబిడ్డలు సంబురంగా జరుపుకునే బతుకమ్మ పండుగ ప్రత్యేకతను వివరించారు. ఏ1 టీవీ తెలుగు న్యూస్ సమర్పణలో రూపొందిన ఈ పాటకు ప్రముఖ రచయిత, దర్శకుడు కోదారి శ్రీనివాస్ సాహిత్యం అందించగా, ప్రముఖ గాయని మమతా రమేష్ ఆలపించారు. నీరజ్ కీస్ సంగీతం, డీఓపీ బాలు ఛాయాగ్రహణం, కొరియోగ్రాఫర్ శాండి నృత్య దర్శకత్వం, డ్యాన్సర్ సాజన్య ప్రదర్శనతో పాట రూపుదిద్దుకుంది. జానపద కళాకారుడు గజ్జల శ్రీనివాస్ పర్యవేక్షణలో రూపొందిన పాటను కవిత అభినందించారు. కార్యక్రమంలో ఏ1 టీవీ తెలుగు న్యూస్ చైర్మన్ బీవీ బాలకృష్ణ, అవుట్‌పుట్ ఎడిటర్, సీనియర్ జర్నలిస్టు ఎంఎన్ తిరుమలరావు, టెక్నికల్ హెడ్ చైతన్య, రిపోర్టర్ దిండిగాల పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్‌తోనే జిల్లాల అభివృద్ధి

మహబూబాబాద్, అక్టోబర్ 10 (అడుగు న్యూస్): మహబూబాబాద్ జిల్లా ఆవిర్భావ దశాబ్ది వేడుకలను పురస్కరించుకుని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి సంబరాలు



నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో కలిసి పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, 2016 అక్టోబర్ 11న కేసీఆర్ కృషితో మహబూబాబాద్ జిల్లా ఏర్పడిందని పేర్కొన్నారు. గతంలో జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు ప్రజలు అనేక ఇబ్బందులు పడేవారని, జిల్లా ఏర్పాటు అనంతరం పాలన ప్రజలకు మరింత చేరువైందని తెలిపారు. ఆధునిక కలెక్టరేట్, మెడికల్ కళాశాల, ఎస్పీ కార్యాలయం, నర్సింగ్ కళాశాల, హార్టికల్చర్ కళాశాల వంటి సంస్థల ఏర్పాటుతో జిల్లాలో అభివృద్ధి జరిగిందన్నారు. గిరిజన తండాలకు రహదారులు, మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సౌకర్యాలు కల్పించడంతోపాటు తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసినట్లు వివరించారు. గిరిజన రిజర్వేషన్లను ఆరు శాతం నుంచి పది శాతానికి పెంచడం, తొర్రూరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయడం వంటి నిర్ణయాలను ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, రెడ్యా నాయక్, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ బిందు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేద్దాం

దేవరుప్పుల, అక్టోబర్ 10 (అడుగు న్యూస్): జనగామ జిల్లా ఆవిర్భావ దశాబ్ది వేడుకలు, బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పల్లా సుందర్ రాంరెడ్డి పిలుపునిచ్చారు. దేవరుప్పుల మండల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో



ఆయన మాట్లాడుతూ, జిల్లా ఏర్పడి పదేళ్లు పూర్తయిన సందర్భంగా జనగామ జిల్లా కలెక్టరేట్ వద్ద మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి ఘనంగా వేడుకలు నిర్వహించాలని కోరారు. దేవరుప్పుల మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సూచించారు. వేడుకల్లో భాగంగా నిర్వహించే బైక్ ర్యాలీకి హాజరయ్యేందుకు ఉదయం 10 గంటలలోపు జనగామ చౌరస్తాకు చేరుకోవాలని పిలుపునిచ్చారు.

## కిటకిటలాడుతున్న బస్టాండ్‌లు

హైదరాబాద్, అక్టోబర్ 10(అడుగు న్యూస్): పండుగ నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లే వారితో హైదరాబాద్‌లోని బస్టాండ్లు కిటకిటలాడుతున్నాయి. ప్రజలు ఇబ్బందులు లేకుండా 7వేల ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు టీజీఎస్ఆర్టీసీ ప్రకటించింది. జేబీఎస్, ఎంజీబీఎస్‌తో పాటు ఉప్పల్, ఎల్బీనగర్, ఆరాంఘర్ తదితర కూడళ్ల నుంచి కూడా ప్రత్యేక బోర్డింగ్ పాయింట్లను ఏర్పాటు చేసింది. రద్దీ దృష్ట్యా శనివారం నుంచి ఈ నెల 22 వరకు 1300 బస్సులను వివిధ జిల్లాలకు నడిపేలా గ్రేటర్ ఆర్టీసీ ప్రణాళిక రూపొందించింది. శుక్రవారం 50 అదనపు బస్సులను పంపినట్లు గ్రేటర్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.శ్రీధర్ పేర్కొన్నారు. పండుగ నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లేందుకు బస్సులు లేక ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు అంటున్నారు. గంటల తరబడి బస్టాండ్‌లోనే వేచి ఉండాల్సివస్తోందని వాపోతున్నారు. మరిన్ని బస్సులు నడిపి తమను గమ్యస్థానాలకు చేర్చాలని ప్రయాణికులు కోరుతున్నారు. ప్రజలు ఇబ్బందులు లేకుండా 7 వేల ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. జేబీఎస్ నుంచి ఈ నెల 10 నుంచి 13 వరకు సాధారణ సర్వీసులతో పాటు రోజుకు వంద, 16, 17, 18 తేదీల్లో 300 నుంచి 400 అదనపు సర్వీసుల ద్వారా ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చనున్నట్టు తెలిపారు.



తెలంగాణ వ్యాప్తంగా ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు

# రైతన్నా.. పంటలు వేయొద్దు



మొదటిపేజీ తరువాయి..

తన నివాసంలో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఎల్‌నినో ప్రభావం, రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు, ప్రజలు ఎదుర్కొనే సమస్యలపై చర్చించారు. ఎల్‌నినో సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో రాబోయే ఎనిమిది నెలలు కీలకమని సీఎం పేర్కొన్నారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రజలను అప్రమత్తం చేసి, నీటి వినియోగం, విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలను భాగస్వాములను చేస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. సినిమా, మీడియా, కళాజాతలు, ఇతర ప్రచార మాధ్యమాల ద్వారా ఎల్‌నినో ప్రభావంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.రాబోయే రోజుల్లో విద్యుత్ సమస్య తీవ్రతరం అయ్యే అవకాశం ఉందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి అవసరమైన విద్యుత్‌ను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఎంత ఖర్చు చేసేందుకైనా సిద్ధంగా ఉందని, అయితే మార్కెట్‌లో విద్యుత్ అందుబాటులో ఉండటం సవాలుగా మారుతోందని తెలిపారు. అందుబాటులో ఉన్న విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్‌పై ఆధారపడే పనులను సాధ్యమైనంత వరకు తాత్కాలికంగా వాయిదా వేసుకునే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. విద్యుత్ సరఫరాను సీఎం కార్యాలయ ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. రైతులు ఇప్పటికే సాగు చేసిన పంటలను కాపాడటంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని రేవంత్ రెడ్డి సూచించారు. పంటల ప్రస్తుత పరిస్థితులను అంచనా వేసి, పంట చేతికొచ్చే వరకు నీటి కొరత రాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. భవిష్యత్తులో తాగునీరు, సాగునీటి సమస్యలు తీవ్రం కాకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని, చుక్క నీరు కూడా వృథా కాకుండా చూడాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావంపై త్వరలో మంత్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు సీఎం తెలిపారు. దాదాపు 215 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో కరువు మండలాల ప్రకటన, ఆర్థిక సాయం తదితర అంశాలపై చర్చించనున్నారు. రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని కేంద్రాన్ని కోరిన విషయాన్ని సీఎం గుర్తుచేశారు. 125 రోజుల ఉపాధికి అదనంగా మరో 50 రోజుల పని కల్పించాలని కేంద్రాన్ని కోరే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. అదనపు పని దినాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. దసరా తర్వాత గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సీఎం ఆదేశించారు. పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు వార్‌రూమ్, ప్రజల సమస్యల పరిష్కారానికి టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని సూచించారు. అవసరమైతే అఖిలపక్ష సమావేశం నిర్వహించే అంశాన్ని కూడా పరిశీలించనున్నారు. ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ముందస్తు సన్నద్ధతకు ప్రాధాన్యం ఇస్తోంది. రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితుల ప్రభావం దృష్ట్యా ఏర్పడిన వర్షాభావ పరిస్థితులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి సారించారు. మంత్రులతో ఆదివారం ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి వర్షాభావ ప్రాంతాల్లో పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలపై చర్చించనున్నారు. వ్యవసాయం, సాగు నీరు, పెరిగిన విద్యుత్ డిమాండ్, తాగునీటి సరఫరా తక్షణ అవసరాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. ఇటీవల జరిగిన తెలంగాణ కేబినెట్ సమావేశంలోనూ వర్షాభావ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో సాధారణం కన్నా 17 శాతం తక్కువ వర్షపాతం నమోదైనట్లుగా అధికారులు అంచనా వేస్తున్నారు. దాదాపు 235 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు ఉన్నట్లు కూడా సర్కారు అంచనా వేస్తోంది. కరవు మండలాల ప్రకటనతో పాటు తగినంత ఆర్థిక సాయాన్ని అందించాలని ఇప్పటికే శాసనసభలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. రూ.20 వేల కోట్ల స్పెషల్ ప్యాకేజీని కేటాయించాలని కూడా కోరింది. ఈ క్రమంలో వర్షాభావ ప్రాంతాల్లో చేపట్టాల్సిన సహాయక చర్యలు, ఇప్పటికే కేబినెట్ సబ్ కమిటీ రూపొందించిన కార్యాచరణ, అఖిలపక్ష సమావేశం, రైతు సంఘాలు, పలు రంగాలకు చెందిన నిపుణుల సలహాలు, సూచనలపై రేవంత్ రెడ్డి నిర్వహించనున్న సమావేశంలో చర్చకు వచ్చే అవకాశం కనిపిస్తోంది. క్షేత్రస్థాయి పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేసి, కరవు ప్రభావిత మండలాలపై ప్రాథమిక నివేదికలను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్లను సీఎస్ సంజయ్ జాజు ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులపై సమీక్షించేందుకు శుక్రవారం సెక్రటేరియట్‌లో ఉన్నతాధికారులతో కలిసి ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి మంత్రులతో సమావేశమైన అనంతరం సచివాలయం నుంచి శాస్త్రవేత్తలు, అధికారులతో వీడియో సమావేశం నిర్వహిస్తారని, అందులో రైతు వేదికల ద్వారా రైతులు పాల్గొంటారని జిల్లా కలెక్టర్లకు తెలిపారు.వ్యవసాయ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఈ కార్యక్రమానికి తగిన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రజాప్రతినిధులను కూడా భాగస్వాములను చేయాలని సూచించారు. లోటు వర్షపాతం కారణంగా ప్రస్తుతం నెలకొన్న పరిస్థితి, వచ్చే ఏడాది మధ్యకాలం వరకు కొనసాగేందుకు అవకాశముందని తెలిపారు. ఈ ప్రతికూల పరిస్థితుల ప్రభావం నుంచి రైతులను కాపాడేందుకు పంటల వైవిధ్యం, ముందస్తు ప్రణాళికలు చాలా అవసరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఆయా జిల్లాల్లో కరవు ప్రభావిత మండలాలను గుర్తిస్తూ ప్రాథమిక నివేదికలను సమర్పించాలని సూచించారు.

## పనామాలో భారీ భూకంపాలు

మొదటిపేజీ తరువాయి..

అరిబా అనే మారుమూల ప్రాంతానికి నైరుతి దిశలో సుమారు 10 కిలోమీటర్ల (6 మైళ్ల) దూరంలో ఉందని, 10 కిలోమీటర్ల లోతున సంభవించిందని పేర్కొంది. భూకంప తీవ్రతకు పలు భవనాలు కూలిపోయాయి. భయంతో జనం ఇళ్లు, కార్యాలయాల నుంచి బయటకు పరుగులు తీశారు. ఈ ప్రమాదంలో ఎంత మంది చనిపోయారన్న విషయంపై ఇంకా పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది. భూకంప తీవ్రతకు శిథిలాల కింద పలు వాహనాలు చిక్కుకుపోవడం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.
భూకంపం తీవ్రత నేపథ్యంలో దక్షిణ, మధ్య అమెరికాలోని 9 దేశాలకు సునామీ ముప్పు పొంచి ఉందని పనామాలోని అమెరికా రాయబార కార్యాలయం హెచ్చరించింది. పనామా, కొలంబియా, కోస్టారికా, ఈక్వెడార్, పెరూ తదితర దేశాల తీర ప్రాంతాలపై సునామీ హెచ్చరికలు జారీ చేసింది. ప్రభావిత ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొంది. తీర ప్రాంత ప్రజలు ఎత్తైన ప్రదేశాలకు తరలివెళ్లాలని సూచించింది. స్థానిక అధికారులు జారీ చేసిన సూచనలు పాటించాలని కోరింది. ప్రస్తుత పరిస్థితిపై అధికారులు నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. మరోవైపు, హెర్రెరా ప్రావిన్స్‌కు చెందిన రోసెండో డొమింగెజ్(60) భూకంప పరిస్థితి గురించి వివరించించారు. "భూకంప తీవ్రతకు వంటగదిలో వస్తువులు కింద పడిపోయాయి. ఏం జరుగుతుందో తెలియక మేమంతా చాలా బయపడ్డాం. కానీ అంతా క్షేమంగానే ఉన్నాం" అని తెలిపారు. ప్రజలంతా ధైర్యంగా ఉండాలని, అనవసర భయాందోళనలకు గురికావద్దని పనామా అధ్యక్షుడు జోస్ రౌల్ ములినో ప్రజలను కోరారు. వెరాగ్వాస్, హెర్రెరా, లాస్ శాంటోస్ అనే మధ్య ప్రావిన్సుల్లో నష్టం ఎక్కువగా కేంద్రీకృతమై ఉందని చెప్పారు. మరోవైపు, భూకంప తీవ్రత గురించి వివరిస్తూ, రాజధానికి సుమారు 93 మైళ్ల (150 కి.మీ.) దూరంలో ఉన్న పెనోనోమ్ నగరంలో భవనం కూలిపోవడంతో పలువురు గాయపడ్డారని ఓ అధికారి చెప్పారు. గవర్నర్ కార్యాలయ భవనం కూడా నష్టం వాటిల్లినట్లు ఆయన ధ్రువీకరించారు. పనామాలోని లాస్ శాంటోస్ ప్రావిన్సులో ఉన్న, కాథలిక్ చర్చి అయిన శాన్ అటానాసియో చర్చి కూడా దెబ్బతిందని స్థానిక వార్తా సంస్థలు నివేదించాయి. ఈ చర్చిని 1938లో జాతీయ చారిత్రక వారసత్వ ప్రదేశంగా ప్రకటించారు. వెరాగ్వాస్ ప్రావిన్సులో సహా ఇతర ప్రాంతాల్లో రహదారుల వెంబడి పగుళ్లు ఏర్పడ్డాయి. పనామా సిటీలోని టోకుమెన్ అంతర్జాతీయ విమానాశ్రయం, దాని కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు తెలిపింది. అన్నిరకాల తనిఖీలు పూర్తైన తర్వాత తిరిగి ప్రారంభమవుతాయని పేర్కొంది. ఉద్యోగులు, నౌకా సిబ్బంది భద్రతే తమకు ముఖ్యమని పనామా కాలువ అథారిటీ తెలిపింది. నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండడం వల్ల భద్రతా కారణాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కాగా, 1991లో పనామాలో సంభవించిన భూకంపం పెను విషాదాన్ని మిగిల్చింది. సమీపంలోని కోస్టారికా కేంద్రంగా సంభవించిన 7.4 తీవ్రత గల ఆ భూకంపం, సరిహద్దు ప్రాంతమైన బోకాస్ డెల్ టోరోలో 23 మందిని బలిగొంది. సుమారు 559 మందిని గాయపడగా, వేలాది మంది నిరాశ్రయులయ్యారు. కోకోస్, నాజ్కా, కరేబియన్ ప్లేట్లతో సహా అనేక టెక్టోనిక్ ప్లేట్ల పరస్పర చర్య కారణంగా, ముఖ్యంగా పనామాకు కోస్టారికాతో ఉన్న సరిహద్దు వెంబడి దాని పసిఫిక్ తీరంలో భూకంపాలు తరచూ వస్తుంటాయి. మరోవైపు ఉత్తరాఖండ్‌లో భూప్రకంపనలు చోటుచేసుకున్నాయి. శనివారం ఒక్కరోజే రాష్ట్రంలో




రెండుసార్లు భూమి కంపించింది. సాయంత్రం ఉత్తరకాశీ జిల్లాలో భూకంపం సంభవించగా, అంతకు కొన్ని గంటల ముందు బాగేశ్వర్ జిల్లాలో ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. వరుస ఘటనలతో స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ (ఎన్‌సీఎస్) వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈరోజు రాత్రి 8:07 గంటల సమయంలో ఉత్తరకాశీ జిల్లాలో భూమి కంపించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 4.2గా నమోదైంది. భూమికి 11 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అంతకుముందు మధ్యాహ్నం 3:40 గంటలకు బాగేశ్వర్ జిల్లాలో కూడా స్వల్ప ప్రకంపనలు వచ్చాయి. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 2.8గా నమోదైంది. ఈ భూకంప కేంద్రం 5 కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు ఎన్‌సీఎస్ తెలిపింది. ఈ రెండు భూకంపాల వల్ల ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరిగినట్లు ఇంతవరకు సమాచారం అందలేదు. ఇటీవలి కాలంలో ఉత్తరాఖండ్‌లో భూకంపాలు తరచూ సంభవిస్తున్నాయి. అక్టోబర్ 6వ తేదీన చమోలీ జిల్లాలో 4.9 తీవ్రతతో భూకంపం రాగా, దాని ప్రభావం దేశ రాజధాని ఢిల్లీ, పరిసర ప్రాంతాలపై కూడా పడింది. తాజా ప్రకంపనలతో దేవభూమిలో మరోసారి భూకంపాల భయం నెలకొంది.




## సిల్లరతోనే స్కూటర్ కొన్నడు!?

సిల్లరని సిల్లరగా సూత్తం. 'సిల్లరగా!' అని సిల్లరగ తిడ్తం. గా సిల్లరనే సిల్లరగ సూసే రోజులు పోయినయి. గా సిల్లరే పదులు, ఎయ్యిలు, లచ్చలు, కోట్లు అయితయి. గందుకే ఒక్కొక్కటి నూటొక్కటి అయితయి అన్నరు. గట్లనే గా మద్దెల ఓ రైతు బిడ్డ సిల్లరతోటి ఏకంగా



కారే కొన్నడు. గిప్పుడు గీ అన్న గా సిల్లరతోటి ఓ స్కూటర్ కొన్నడు. గదెక్కడో సూద్దాం పాండ్రి.

గీయినె పేరు బొడ్డు రవి జోసెఫ్. గియినెది మంచిర్యాల జిల్ల. గీయినె మూడేండ్లుగ పది రూపాయెల బిల్లలను సేకరిత్తాండు. గట్ల గవాటిని 1 లచ్చా 23 యేలు అయ్యేదాకా ఒక్కదగ్గరేసిండు. స్కూటర్ కావాల్నని, గా స్కూటర్లను అమ్మే రమేశ్ తానికి పోయిండు. గీ ముచ్చట చెప్తే, గా పైసల్ని తెమ్మన్నడు. గవాటిని లెక్కగట్టి, గాయినెకు గా స్కూటర్ ఇచ్చిండ్లు. గదే మరి సిల్లర అని సీప్ గ సూడకుండ్రి. కావాల్నంటే మీరూ కూడేయ్యండ్రి. మంచిగ మీకు నచ్చిన వస్తువును కొనుక్కోండ్రి.

## రష్యాతో అమెరికా డీజిల్ ఒప్పందం

మొదటిపేజీ తరువాయి..

మెట్రిక్ టన్నుల డీజిల్‌ను అమెరికాకు, ప్రపంచ మార్కెట్లకు సరఫరా చేస్తుందని ఆయన వెల్లడించారు. దీనికి అదనంగా నవంబర్‌లో 5 లక్షల టన్నులు, ఆ తర్వాత కొద్ది కాలానికే మరో 10 లక్షల టన్నుల డీజిల్ అందుతుందని చెప్పారు. రష్యాలోని రిఫైనరీల పరిస్థితిని బట్టి భవిష్యత్తులో సరఫరా మరింత పెరిగే అవకాశం ఉందని ఆయన వివరించారు. ఈ ఒప్పందం ద్వారా అమెరికాలో, ముఖ్యంగా రైతులు, పశుపోషకులు, ట్రక్కర్లపై భారం తగ్గి, డీజిల్ ధరలు దిగివస్తాయని ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఒప్పందానికి మార్గం సుగమం చేస్తూ, అమెరికా ట్రెజరీ విభాగం ఒక తాత్కాలిక జనరల్ లైసెన్సును జారీ చేసింది. దీని ద్వారా ఏప్రిల్ 2027 వరకు రష్యా డీజిల్ సరఫరాపై ఉన్న కొన్ని ఆంక్షలను సడలించారు. ప్రస్తుతం అమెరికాలో గ్యాలన్ డీజిల్ ధర 6.28 డాలర్ల వద్ద ఉండటంతో ధరల నియంత్రణకు ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. అయితే, ఈ ఒప్పందంపై జెలెన్‌స్కీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. "ఇది యుద్ధాన్ని ముగించడానికి కాకుండా, మరింత కాలం పొడిగించడానికి చేసే పెట్టుబడి" అని ఆయన తీవ్రంగా విమర్శించారు. రష్యాకు పెట్రోలియం ఉత్పత్తులను అమ్ముకునేందుకు అనుమతించడం ద్వారా మాస్కోకు అదనపు నిధులు సమకూరుతాయని, పుతిన్‌కు ఇచ్చే ఇలాంటి బహుమతులు శాంతిని తీసుకురావని ఆయన అన్నారు. అమెరికాలో చర్చల కోసం ఉన్న తమ ప్రతినిధి బృందాన్ని ఈ ఒప్పందం కోసం ఒక ముసుగుగా వాడుకున్నారని, బలమైన మిత్రపక్షాలు తీసుకున్న బలహీనమైన నిర్ణయం ఇదని జెలెన్‌స్కీ వ్యాఖ్యానించారు. మరోవైపు, అమెరికాకు, ప్రపంచ మార్కెట్లకు చమురు, పెట్రోలియం ఉత్పత్తులను సరఫరా చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని రష్యా అధికారులు ధ్రువీకరించారు. అయితే, ఇంధన రంగ విశ్లేషకులు మాత్రం ఈ ఒప్పందం ప్రభావంపై మిశ్రమంగా స్పందించారు. ప్రారంభంలో అందే డీజిల్ పరిమాణం మార్కెట్ డిమాండ్‌లో చాలా తక్కువని, ఇది ధరలను స్థిరంగా తగ్గించలేకపోవచ్చని అంచనా వేస్తున్నారు. అయితే, మార్కెట్‌లో నెలకొన్న సరఫరా కొరతను ఇది కొంతమేర తగ్గించవచ్చని అభిప్రాయపడ్డారు. అమెరికాలో జరగనున్న మధ్యంతర ఎన్నికల నేపథ్యంలో పెరిగిన ఇంధన ధరలను అదుపులోకి తెచ్చే ప్రయత్నంలో భాగంగానే ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

## 'ఓటు చోరీ' ఆరోపణలను తిప్పికొట్టండి

మొదటిపేజీ తరువాయి..

తొలగింపుపై కాంగ్రెస్ చేస్తున్న అసత్య ఆరోపణలను ఖండించారు. వరుస ఎన్నికల్లో ఓటమి పాలవుతున్న కాంగ్రెస్ పార్టీ, రాజ్యాంగబద్ధ సంస్థలపై బురదజల్లే ప్రయత్నం చేస్తోందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ చేపట్టిన 'ఓటు చోరీ' ప్రచారాన్ని ప్రజల్లో ఎండగట్టాలని, ప్రజాస్వామ్యంలో స్వచ్ఛమైన ఓటర్ల జాబితా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలని ఆయన పార్టీ శ్రేణులకు సూచించారు. ఓటర్ల జాబితా నుంచి తమ మద్దతుదారుల పేర్లను అక్రమంగా తొలగిస్తున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో రాంచందర్ రావు ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ అంశంపై కాంగ్రెస్ నేతలు ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు, జాతీయ స్థాయిలో రాష్ట్రపతిని కూడా కలిసి తమ వాదనలు వినిపించారు.



## ఎన్‌వోసీ నిబంధనల్లో కీలక సవరణలు

హైదారాబాద్, అక్టోబర్ 10(అడుగు న్యూస్): తెలంగాణ రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన, అగ్నిమాపక, ఎమర్జెన్సీ సర్వీసెస్, పౌర రక్షణ శాఖ తాత్కాలిక అగ్నిమాపక నిరభ్యంతర ధ్రువపత్రాల (ఎన్‌వోసీ) జారీకి సంబంధించిన నిబంధనల్లో కీలక సవరణలు చేపట్టింది. గత నెల 21న పురపాలక శాఖ జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వుకు అనుగుణంగా ఈ సవరణలు అమలు చేసింది. ఈ ప్రక్రియలో భాగంగా ఆ శాఖ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్ గత నెల 23న భారతీయ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ల సమాఖ్య (క్రెడాయ్), జాతీయ రియల్ ఎస్టేట్ అభివృద్ధి మండలి (నరెడ్కో)తో పాటు తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ సహా ప్రముఖ నిర్మాణ పరిశ్రమ సంఘాల ప్రతినిధులతో సంప్రదింపులు జరిపారు. భవనాల ఎత్తు, ఫైర్ టవర్లు, ఫైర్ కమాండ్ సెంటర్లు, బేస్‌మెంట్లలోని జనరేటర్ గదులకు వెంటిలేషన్ ఏర్పాట్ల లాంటి పలు అగ్ని, ప్రాణ భద్రతా నిబంధనలు అమలు చేయడంలో ఎదురయ్యే ఆచరణాత్మక సవాళ్లపై డైరెక్టర్ జనరల్ విక్రమ్‌సింగ్ మాన్ విస్తృతంగా చర్చించారు. అనంతరం సవరించిన నిబంధనలు జారీ చేశారు. టెంపరరీ ఫైర్ ఎన్‌వోసీల కోసం వచ్చిన దరఖాస్తులు పరిశీలించేటప్పుడు అగ్ని, ప్రాణ భద్రతా చర్యలను అమలు చేయడానికి స్పష్టమైన, ఏకరీతి, ఆచరణాత్మక విధానాన్ని ఏర్పాటు చేయడమే ఈ సవరణల ప్రధాన లక్ష్యమని ఆయన వెల్లడించారు. కొత్త నిబంధనలు ఈ నెల 7వ తేదీ నుంచే అమల్లోకి వచ్చాయని ఆయన స్పష్టం చేశారు. గతంలో 18 మీటర్లు లేదా అంతకంటే ఎక్కువ ఎత్తు ఉన్న అపార్ట్‌మెంట్ భవనాలకు ఫైర్ నిరభ్యంతర ధ్రువపత్రం పొందడం తప్పనిసరి. అయితే తాజాగా ఈ పరిమితిని 24 మీటర్లకు పెంచారు. ఇతర రకాల భవనాల నిబంధనల్లో ఎలాంటి మార్పులు లేవు. 24 మీటర్లు లేదా అంతకంటే ఎక్కువ ఎత్తు ఉన్న ఏ భవనానికైనా దాని వినియోగంతో సంబంధం లేకుండా ఫైర్ టవర్, ఫైర్ కమాండ్ సెంటర్ రూమ్ ఏర్పాటు చేయడం తప్పనిసరి. బేస్‌మెంట్లలో ఉన్న డీజిల్ జనరేటర్ గదుల వెంటిలేషన్‌కు సంబంధించి ప్రత్యేకంగా నిర్దిష్ట సవరణలు చేశారు. కనీసం ఒక మీటరు ఎత్తు ఉన్న అగ్ని నిరోధక గోడ పైన లూవర్లను ఏర్పాటు చేయడానికి అనుమతి ఇచ్చారు. అయితే ఈ గోడలు కచ్చితంగా రెండు గంటల పాటు మంటలను ఆపగలిగే సామర్థ్యం ఉండాలి.

సమగ్ర తెలుగు దినపత్రిక
అడుగు
The Step Towords The Truth..

## ప్రక్షాళన దిశగా చెన్నై సూపర్ కింగ్స్

### బ్యాటింగ్ కోచ్ మైకెల్ హస్సీని తొలగింపు

ఐపీఎల్ చరిత్రలో అత్యంత విజయవంతమైన ఫ్రాంచైజీలలో ఒకటైన చెన్నై సూపర్ కింగ్స్ కీలక నిర్ణయం తీసుకుంది. తమ ఐదు టైటిళ్ల ప్రయాణంలో కీలక పాత్ర పోషించిన మాజీ ఆస్ట్రేలియా దిగ్గజం, "మిస్టర్ క్రికెట్" మైకేల్ హస్సీతో విడిపోయింది. 2018 నుంచి జట్టు బ్యాటింగ్ కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న హస్సీతో బంధం తెంచుకుంది! పరస్పర అంగీకారంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. రాబోయే ఐపీఎల్ 2027 సీజన్ దృష్ట్యా చెన్నై సూపర్ కింగ్స్ మేనేజ్‌మెంట్ తమ కోచింగ్ స్టాఫ్‌ను సరికొత్తగా తీర్చిదిద్దుతోంది. ఈ ఏడాది ప్రారంభంలోనే సుదీర్ఘకాలం హెడ్ కోచ్‌గా పనిచేసిన స్టీఫెన్ ఫ్లెమింగ్‌ను సాగనంపి, ఆ స్థానంలో భారత మాజీ పేస్ దిగ్గజం జహీర్ ఖాన్‌ను హెడ్ కోచ్‌గా నియమించింది. అలాగే బౌలింగ్ కోచ్ ఎరిక్ సిమ్మన్స్ స్థానంలో మాజీ సీఎస్‌కే పేసర్ మోహిత్ శర్మను బాధ్యతల్లోకి తీసుకొచ్చారు. ఫీల్డింగ్ కోచ్ జేమ్స్ ఫోస్టర్ భవిష్యత్తు కూడా అనిశ్చితిలో పడటంతో చెన్నై యాజమాన్యం పక్కా కొత్త ప్లాన్స్‌తో సిద్ధమవుతున్నట్లు స్పష్టమవుతోంది. సీఎస్‌కేను వీడిన మైకేల్ హస్సీ త్వరలోనే ఇంగ్లాండ్ జాతీయ టెస్టు జట్టు కోచింగ్ దళంలో చేరే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇంగ్లాండ్ టెస్ట్ హెడ్ కోచ్‌గా నియమితుడైన స్టీఫెన్ ఫ్లెమింగ్, హస్సీకి మంచి ఆప్తుడు. ఆగస్టులోనే హస్సీని ఇంగ్లాండ్ బ్యాటింగ్ కోచ్‌గా తీసుకురావాలని ఫ్లెమింగ్ భావించినట్లు వార్తలు వచ్చాయి. ఇదివరకు 2022 టీ20 ప్రపంచకప్‌లో ఇంగ్లాండ్ జట్టు కన్సల్టెంట్‌గా పనిచేసి.. వారికి టైటిల్ అందించడంలో హస్సీ కీలక పాత్ర పోషించాడు. దీంతో ఫ్లెమింగ్-హస్సీ కాంబో ఇప్పుడు ఇంగ్లాండ్ గడ్డపై సందడి చేసే అవకాశం ఉంది. మైకేల్ హస్సీ స్థానాన్ని భర్తీ చేసేందుకు చెన్నై సూపర్ కింగ్స్ ఎవరిని రంగంలోకి దించుతుందనే అంశంపై క్రికెట్ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఇండియన్ కండిషన్స్, యంగ్ టాలెంట్‌ను ప్రోత్సహించడంలో సిద్ధహస్తుడైన భారత్ లేదా విదేశీ దిగ్గజాన్ని ఎంపిక చేసే యోచనలో ఫ్రాంచైజీ ఉందట. జహీర్ ఖాన్ నేతృత్వంలోని నూతన కోచింగ్ ప్యానెల్ రాబోయే సీజన్‌లో సిఎస్‌కేకు 6వ టైటిల్ అందిస్తుందో లేదో చూడాలి.



## కోహ్లీ రికార్డును సమం చేసిన సంజూ

రాంచీ వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన రెండో టీ20 సమరంలో భారత వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ పరుగుల సునామీ సృష్టించాడు. గత నాలుగు మ్యాచ్‌లలో వరుసగా సింగిల్ డిజిట్ స్కోర్లకే పరిమితమై విమర్శలు ఎదుర్కొన్న సంజూ, ఈ మ్యాచ్‌లో తన విశ్వరూపం చూపించాడు. కేవలం 21 బంతుల్లోనే హాఫ్ సెంచరీ నమోదు చేసి అంతర్జాతీయ టీ20ల్లో తన తొమ్మిదో అర్ధ శతకాన్ని పూర్తి చేశాడు. వెస్టిండీస్‌పై ఒక భారత బ్యాటర్ సాధించిన అత్యంత వేగవంతమైన టీ20 హాఫ్ సెంచరీ రికార్డును అతడు సమం చేశాడు. గతంలో 2019 డిసెంబర్ 11న ముంబై వేదికగా విండీస్‌పై విరాట్ కోహ్లీ సరిగ్గా 21 బంతుల్లోనే ఫిఫ్టీ బాదగా, ఇప్పుడు ఆ రికార్డు సరసన సంజూ నిలిచాడు. ఓవరాల్‌గా 41 బంతుల్లో 9 ఫోర్లు, 4 భారీ సిక్సర్లతో 82 పరుగులు బాదిన సంజూ, భారత్ 20 ఓవర్లలో 249/5 పరుగుల రికార్డు స్కోరు సాధించడంలో ప్రధాన పాత్ర పోషించాడు. వెస్టిండీస్‌పై టీ20ల్లో భారత్‌కు ఇదే అత్యధిక స్కోరు కావడం విశేషం. అయితే వెస్టిండీస్ రికార్డు చేజింగ్ తో మ్యాచ్ ను సొంతం చేసుకుంది. కెప్టెన్ షాయ్ హోప్ అజేయ సెంచరీ (102 నాటౌట్) తో చెలరేగడంతో 18.3 ఓవర్లలోనే 4 వికెట్లకు 252 పరుగులు చేసిన కరీబియన్ జట్టు విజయం సాధించింది. ఇక ఇరుజట్ల మధ్య మూడో వన్డే ఆదివారం ఇండోర్ వేదికగా జరుగుతుంది.



ఇన్నింగ్స్ ఆరంభంలో సంజూ కాస్త తడబడ్డాడు. ఆరు పరుగుల వద్ద ఉన్నప్పుడు అకీల్ హొసేన్ బౌలింగ్‌లో కమిల్ పూరన్ సులువైన క్యాచ్ వదిలేశాడు. దక్కిన అవకాశాన్ని సంజూ పూర్తిగా ఉపయోగించుకున్నాడు. హొసేన్ ఓవర్లోనే మూడు సిక్సర్లు, రెండు ఫోర్లు బాది స్టేడియాన్ని హోరెత్తించాడు. అభిషేక్ శర్మ 20 పరుగులకు అవుటైన తర్వాత, లోకల్ బాయ్ ఇషాన్ కిషన్‌తో కలిసి సంజూ రెండో వికెట్‌కు కేవలం 43 బంతుల్లోనే 97 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఇషాన్ 22 బంతుల్లో 43 పరుగులు చేసి సహకరించాడు. 40లలో ఉన్నప్పుడు గుడాకేశ్ మోతీ కూడా సంజూ క్యాచ్ నేలపాలు చేయడంతో, రొమారియో షెపర్డ్ బౌలింగ్‌లో వరుస ఫోర్లతో సంజూ తన హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 11 ఓవర్లలో 139/1తో పటిష్ఠంగా ఉన్న భారత్‌ను రోస్టన్ చేజ్ దెబ్బతీశాడు. వరుస ఓవర్లలో ఇషాన్ కిషన్, నాల్గో స్థానంలో ప్రమోషన్ పొందిన శివమ్ దూబే (7)లను క్లీన్ బౌల్డ్ చేశాడు. సెంచరీకి చేరువవుతున్న సమయంలో సంజూ శాంసన్ 15వ ఓవర్లో ర్యాంప్ షాట్ ఆడబోయి డీప్ బ్యాక్‌వర్డ్ పాయింట్‌లో పూరన్‌కు చిక్కాడు. దీంతో భారత్ 23 పరుగుల వ్యవధిలో మూడు కీలక వికెట్లు కోల్పోయింది. ఆ దశలో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, తిలక్ వర్మ అద్భుతమైన ఎదురుదాడికి దిగారు. అయ్యర్ కేవలం 18 బంతుల్లో 40 రన్స్ చేయగా, తిలక్ వర్మ 18 బంతుల్లో 44 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. వీరిద్దరూ కేవలం 32 బంతుల్లోనే 83 పరుగులు జోడించడంతో భారత్ గతంలో 2016లో నమోదు చేసిన 244/4 రికార్డును దాటి సరికొత్త శిఖరాన్ని అందుకుంది. ఈ క్రమంలో తిలక్ వర్మ టీ20ల్లో 5,000 పరుగుల మైలురాయిని కూడా చేరుకున్నాడు.

## రొనాల్డోపై సస్పెన్షన్ వేటు

ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డోకు తన సొంత దేశపు ఫుట్‌బాల్ అసోసియేషన్ నుంచి ఊహించని షాక్ తగిలింది. జాతీయ జట్టు నుంచి అర్ధాంతరంగా నిష్క్రమించిన వ్యవహారంలో 41 ఏళ్ల రొనాల్డోపై క్రమశిక్షణా చర్యలు ప్రారంభించినట్లు పోర్చుగీస్ ఫుట్‌బాల్ ఫెడరేషన్ (ఎఫ్ పీఎఫ్) శనివారం అధికారికంగా ప్రకటించింది. దీనిపై విచారణ ముగిసి తుది నిర్ణయం వెలువడే వరకు అతడిని ప్రొవిజనల్‌గా సస్పెండ్ చేసింది. ఈ వ్యవహారాన్ని అత్యవసర కేసుగా పరిగణిస్తున్నట్లు ఫెడరేషన్ స్పష్టం చేసింది. అంతకుముందు అభిమానులకు క్షమాపణలు చెప్పిన రొనాల్డో, హెడ్ కోచ్ జార్జ్ జీసస్ తీరును తీవ్రంగా తప్పుపట్టాడు. ఫెడరేషన్ విధించే ఎలాంటి శిక్షకైనా తాను సిద్ధమని పేర్కొన్నాడు. పోర్చుగల్ తరఫున ఆల్‌టైమ్ అత్యధిక గోల్స్ సాధించడంతో పాటు అత్యధిక మ్యాచ్‌లు ఆడిన రికార్డు ఈ మాజీ రియల్ మాడ్రిడ్, మాంచెస్టర్ యునైటెడ్ స్టార్ సొంతం. సెప్టెంబర్ 27న నార్వేతో జరిగిన మ్యాచ్‌లో రొనాల్డోను సబ్‌స్టిట్యూట్‌గా వార్మప్ చేయించి ఆ తర్వాత మైదానంలోకి దించలేదు. ఆ వెంటనే అక్టోబర్ 1న డెన్మార్క్‌తో జరిగే మ్యాచ్‌లోనూ తుది జట్టులో స్థానం దక్కదని తెలియడంతో తీవ్ర ఆగ్రహానికి గురైన రొనాల్డో జాతీయ జట్టు క్యాంప్ నుంచి అర్ధాంతరంగా బయటకు వచ్చాడు. నేషన్స్ లీగ్ మ్యాచుల్లో తనకు సరైన గేమ్ టైమ్ ఇస్తానని చెప్పి కోచ్ జార్జ్ జీసస్ మాట తప్పాడని మంగళవారం రొనాల్డో తీవ్ర ఆరోపణలు చేశాడు. జట్టు నుంచి వైదొలగినప్పటికీ అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు తాను వీడ్కోలు పలకడం లేదని రొనాల్డో వివరించాడు. తన తప్పుకు ఫెడరేషన్ విధించే



శిక్షను అనుభవించడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపాడు. "జాతీయ జట్టు కోసం పోటీ పడి గెలవడానికి నేను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాను, భవిష్యత్తులోనూ అందుబాటులో ఉంటాను" అని రొనాల్డో పేర్కొన్నాడు. వివాదం నడుస్తున్నప్పటికీ పోర్చుగల్ జట్టు నేషన్స్ లీగ్‌లో వరుసగా నాలుగు మ్యాచ్‌లు గెలిచి రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధించింది. సౌదీ ప్రో లీగ్‌లో అల్-నస్ర్ తరఫున మైదానంలోకి దిగిన రొనాల్డో, దిరియాతో జరిగిన మ్యాచ్‌లో గోల్ కొట్టి జట్టును 3-0తో గెలిపించాడు. క్లబ్ స్థాయిలో తన ఫామ్‌ను కొనసాగిస్తున్నప్పటికీ, పోర్చుగల్ జట్టులో అతడి భవిష్యత్తుపై సస్పెన్షన్ నీలినీడలు కమ్ముకున్నాయి.

## 25% జీతం కోత పడినా దేశం కోసమే ఆట

భారత్‌తో జరిగిన రెండో టీ20 మ్యాచులో వెస్టిండీస్ కెప్టెన్ షై హోప్ విశ్వరూపం చూపించాడు. 250 పరుగుల లక్ష్యాన్ని ఆ జట్టు ఛేదించిందంటే.. దానికి ప్రధాన కారణం హోప్. ఓ పక్క తొలి ఓవర్‌లోనే రెండు వికెట్లు కోల్పోయినా.. హోప్ మాత్రం ఆశలు కోల్పోలేదు, పోరాటం ఆపలేదు. 45 బంతుల్లో 102 పరుగులతో అజేయంగా నిలిచి జట్టును గెలిపించాడు. అయితే అతడికి సంబంధించిన ఓ వార్త ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వెస్టిండీస్ క్రికెట్ జట్టుకు నాయకత్వం వహిస్తున్న షాయ్ హోప్ కేవలం మైదానంలోనే కాదు, బయట కూడా అసలైన నాయకుడిగా నిలుస్తున్నాడు. ప్రస్తుతం కరేబియన్ క్రికెట్ బోర్డు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. దీంతో తన వార్షిక సెంట్రల్ కాంట్రాక్ట్‌లో 25 శాతం జీతం తగ్గించుకోవడానికి హోప్ సిద్ధపడ్డాడు. డబ్బు కంటే దేశం తరఫున ఆడటమే ప్రాధాన్యమని నిరూపిస్తూ, తీవ్రమైన కష్టాల్లోనూ విండీస్ క్రికెట్‌ను ముందుకు నడిపిస్తున్నాడు. చాలా మంది ఆటగాళ్లు.. జాతీయ జట్టును వదిలి లీగ్ క్రికెట్ ఆడేందుకు ఆసక్తి చూపుతున్నా.. అతడు మాత్రం దేశమే తన మొదటి ప్రాధాన్యత అని చాటి చెబుతున్నాడు. జాతీయ బోర్డు ఇచ్చే తక్కువ జీతంతో కుటుంబపోషణ కష్టంగా మారిన తరుణంలో, షైయ్ హోప్‌కు ఐపీఎల్‌లో మంచి కాంట్రాక్ట్ దక్కాలని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దేశం కోసం అంతగా త్యాగం చేస్తున్న ఆటగాడికి ఐపీఎల్ లీగ్ ద్వారా తగిన గుర్తింపు, ఆర్థిక భరోసా లభించాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు. ఈ ఏడాది చివర్లో జరిగే ఐపీఎల్ వేలంలో ఫ్రాంచైజీలు అతడి వైపు మొగ్గు చూపితే హోప్ కుటుంబానికి పెద్ద కొండంత అండ లభించినట్లవుతుంది. ఐపీఎల్‌లో అతడికి అవకాశం లభిస్తే.. మరిన్ని విధ్వంసకర ఇన్నింగ్స్‌లు చూసే అవకాశం ఉంది. ఇక తగ్గిన జీతాలు, విమర్శలు ఏవీ షైహోప్ బ్యాటింగ్ జోరును తగ్గించలేకపోయాయి. ఈ పర్యటనలో అతడు ఇప్పటికే మూడు సెంచరీలు నమోదు చేశాడు. వన్డేల్లో రెండు, టీ20లలో ఒక సెంచరీతో పాటు.. మరో హాఫ్ సెంచరీ కూడా కొట్టాడు. దీంతో వెస్టిండీస్ క్రికెట్ జట్టు ఆశాకిరణంగా నిలుస్తున్నాడు.





సమగ్ర తెలుగు దినపత్రిక
అడుగు
The Step Towords The Truth..



## రకుల్‌కు బర్త్‌డే విషెస్ చెప్పిన బన్నీ

టాలీవుడ్ సెలబ్రెటీల పుట్టినరోజులు వస్తే చాలు.. తోటి నటీనటులు, దర్శకులు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలుపుకోవడం ఆనవాయితీ. అయితే అదే సోషల్ మీడియాలో ఎవరెవరికి విష్ చేశారు, ఎవరిని వదిలేశారనే చిన్న అంశం కూడా ఒక్కోసారి ఊహించని విధంగా ఫ్యాన్ వార్స్‌కు దారితీస్తుంటుంది. తాజాగా అక్టోబర్ 10న టాలీవుడ్‌లో సరిగ్గా ఇలాంటి ఆసక్తికరమైన చర్చే తెరపైకి వచ్చింది. ఒకే రోజు పుట్టినరోజు జరుపుకున్న స్టార్ హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్, దిగ్గజ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళిలో.. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ రకుల్‌కు మాత్రమే ఎక్స్ ద్వారా విష్ చేయడం నెట్టింట పెను దుమారానికి కారణమైంది. 'సరైనోడు' చిత్రంలో తన సరసన నటించిన కో-స్టార్ రకుల్ ప్రీత్ సింగ్‌కు అల్లు అర్జున్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా "హ్యాపీ బర్త్‌డే మై ఫేవరెట్' అంటూ ఆత్మీయంగా శుభాకాంక్షలు తెలిపారు. అయితే ఇదే రోజున తెలుగు సినిమా ఖ్యాతిని ప్రపంచవ్యాప్తం చేసిన 'దర్శకధీరుడు' రాజమౌళి 53వ పుట్టినరోజు కూడా ఉంది. దేశవ్యాప్తంగా సినీ ప్రముఖులు, అభిమానులు జక్కన్నకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతుంటే.. అల్లు అర్జున్ మాత్రం ఆయన్ని పట్టించుకోకుండా కేవలం రకుల్‌కు మాత్రమే విష్ చేయడంపై కొందరు నెటిజన్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ పరిణామంతో ఎన్టీఆర్, రామ్ చరణ్, ప్రభాస్ అభిమానులతో పాటు పలువురు నెటిజన్లు బన్నీని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పిస్తున్నారు. "ప్రపంచమంతా ఒకవైపు ఉండి రాజమౌళికి విషెస్ చెబుతుంటే.. బన్నీ మాత్రం రకుల్‌కి చెప్పి సరిపెట్టుకున్నారు" అంటూ ట్రోల్స్ వర్షం కురిపించారు. ఈ క్రమంలో గతంలో 'మగధీర' 100 రోజుల వేడుక సందర్భంగా అల్లు అరవింద్, రాజమౌళి మధ్య చోటుచేసుకున్న పాత అభిప్రాయభేదాల అంశాన్ని, అలాగే ఇటీవల మెగా-అల్లు కుటుంబాల మధ్య నడుస్తున్న సోషల్ మీడియా వార్‌ను కూడా తెరపైకి తెస్తూ రకరకాల ఊహాగానాలకు తెరలేపుతున్నారు. మరోవైపు ఈ విమర్శలపై అల్లు అర్జున్ అభిమానులు అంతే దీటుగా స్పందిస్తున్నారు. "ఒక చిన్న పుట్టినరోజు ట్వీట్‌ను పట్టుకుని ఇంత రాద్ధాంతం చేయడం అర్థరహితం. రకుల్‌తో బన్నీకి ఎంతో ఆత్మీయ బంధం ఉంది. స్నేహితురాలు కాబట్టే పబ్లిక్‌గా విష్ చేశారు. అంతమాత్రాన రాజమౌళిపై గౌరవం లేనట్లు కాదు. ఆయనతో బన్నీ వ్యక్తిగతంగా ఫోన్ చేసి మాట్లాడి ఉండవచ్చు కదా?. ప్రతిదానికీ లేనిపోని వివాదాలు అంటగట్టడం మానుకోండి" అంటూ కౌంటర్లు ఇస్తున్నారు. ప్రస్తుతం సోషల్ మీడియా వేదికగా సాగుతున్న ఈ చర్చ టాలీవుడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

## క్లాసీ లుక్‌లోకి నాని..

'ది ప్యారడైజ్'తో థియేటర్లలో సందడి చేస్తున్నారు నేచురల్ స్టార్ నాని (ఛీుఐఅ). ఆ సినిమాలో మాసీ రోల్ చేశారు. అయితే... తన తదుపరి సినిమాలో స్టైలిష్ యాక్షన్ రోల్ చేయనున్నారని తాజాగా విడుదలైన వీడియో చూస్తే అర్థం అవుతోంది. 'ది ప్యారడైజ్' కోసం దాదాపు రెండేళ్లకు సమయం కేటాయించడంతో పాటు తీరిక లేకుండా గడిపిన నాని... ఇప్పుడు కొత్త సినిమా 'బ్లడీ రోమియో' కోసం రెడీ అవుతున్నారు. నాని 'బ్లడీ రోమియో'కు సుజీత్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా ఎప్పటి నుంచో చర్చల్లో ఉంది. అనౌన్స్ చేశారు కూడా! గ్లింప్స్ విడుదలైన తర్వాత నుంచి ప్రేక్షకులలో... అటు నాని, ఇటు సుజీత్ అభిమానులలో సినిమాపై అంచనాలు నెలకొన్నాయి. సినిమాల్లో హీరోలను స్టైలిష్‌గా చూపించడంలో, స్క్రీన్ మీద హీరోలను ప్రెజెంట్ చేయడంలో సుజీత్ స్పెషలిస్ట్. 'రన్ రాజా రన్', 'సాహో', 'ఓజీ' వంటి భారీ స్టైలిష్ సినిమాలను ఆయన తీశారు. ఇప్పుడు 'బ్లడీ రోమియో'లో నానిని సరికొత్తగా ఆవిష్కరించనున్నారు. గ్యాంగ్‌స్టర్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమాలో ఇప్పటి వరకు ఎన్నడూ కనిపించని విధంగా క్లాసీ, ట్రెండీ లుక్‌లో నాని కనిపించనున్నారని మేకోవర్ వీడియో చూస్తే అర్థం అవుతోంది. నాని మేకోవర్ ప్రాసెస్ అంతటినీ సుజీత్ దగ్గరుండి చూసుకున్నారు. హెయిర్ స్టైల్ నుంచి ట్రెండీ గాగుల్స్ వరకు... అన్నిటినీ ఫిక్స్ చేశారు. నాని కొత్త లుక్ టెస్ట్, ఫోటోషూట్ కంప్లీట్ చేశారు. అయితే ఆయన లుక్‌ను ఇంకా రివీల్ చేయలేదు. దాంతో నాని సరికొత్త స్టైలిష్ అవతార్ గురించి ఆడియన్స్ అందరిలో క్యూరియాసిటీ పెరిగింది. నాని హీరోగా సుజీత్ దర్శకత్వం వహించనున్న 'బ్లడీ రోమియో' సినిమాను నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్, యునానిమస్ ప్రొడక్షన్స్ సంస్థలపై వెంకట్ బోయనపల్లి ప్రొడ్యూస్ చేస్తున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉంది సినిమా. త్వరలో షూట్ స్టార్ట్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. దసరా సందర్భంగా నాని లుక్‌ను విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నారట. ఆ తర్వాత రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ చేయనున్నారు. వచ్చే ఏడాది వేసవిలో థియేటర్లలోకి సినిమాను తీసుకురావాలన్న ఆలోచనతో చిత్ర బృందం ఉంది.



## నా మూవీస్‌కు టికెట్ రేట్స్ పెరగవు

టాలీవుడ్ యంగ్ హీరో విజయ్ దేవరకొండ, రష్మిక జంటగా నటించిన లేటెస్ట్ పీరియాడికల్ యాక్షన్ ఎంటర్టైనర్ 'రణబాలి' దసరా సందర్భంగా అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే రిలీజ్ చేసిన ట్రైలర్ ట్రెండ్ అవుతోంది. ఈ క్రమంలో మూవీ టీం ప్రమోషన్స్ స్పీడప్ చేసింది. తాజాగా టికెట్ ధరలపై హీరో విజయ్ కీలకనిర్ణయం తీసుకున్నారు. తన సినిమాలకు టికెట్ ధరలు పెరగవని క్లారిటీ ఇచ్చారు విజయ్ దేవరకొండ. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... దీనికి గల కారణాన్ని చెప్పారు. 'నా సినిమాలకు టికెట్ ధరలు పెంచొద్దని నేను ఎప్పుడూ నిర్మాతలకు చెబుతుంటాను. కావాలంటే నా రెమ్యునరేషన్ తగ్గించుకోమని చెబుతాను. లేదా నాకొచ్చే లాభాల్లో వాటాలు తీసుకోమంటాను. దీనికి ఓ కారణం ఉంది. నా కాలేజీ రోజుల్లో నాన్న రోజూ రూ.10 ఇచ్చేవారు. దాన్ని దాచుకుని వారమయ్యాక ఐమ్యాక్స్‌లో మూవీ చూడడానికి వెళ్లేవాడిని. ఓసారి టికెట్ ధర రూ.100కు పెంచేశారు. ఇలా ఎలా చేస్తారని ఆ రోజు చాలా బాధపడ్డా. నేను హీరో అయ్యాక నా మూవీస్‌కు టికెట్ ధరల పెంపుపై నిర్మాతలతో చర్చ జరిగితే వద్దని చెప్పేవాడిని. ఒకవేళ రాజమౌళి సార్‌తో సినిమా చేస్తే తప్ప... నా సినిమాలకు టికెట్ రేట్స్ పెంపు ఉండదు.' అంటూ క్లారిటీ ఇచ్చారు. తనకు బయోపిక్స్‌లో నటించడం అంటే చాలా ఇష్టమని చెప్పారు విజయ్ దేవరకొండ. 'నేను ఎప్పటి నుంచో సత్యసాయి బాబా బయోపిక్ చేయాలనుకున్నా. కానీ, చేయలేకపోయా. అందుకు కారణం ఆయనలో స్వచ్ఛత, సున్నితత్వం నాలో లేదు. అందుకే చేయలేదు. నాకు సరిపోయే వేరే బయోపిక్స్ తప్పుకుండా చేసేందుకు ప్రయత్నిస్తా. పెళ్లిచూపులు తర్వాత కంఫర్ట్‌గా చేసిన సినిమా ఇదే. రిలీజ్‌కు ముందు 2, 3 సార్లు చూసుకున్నాం. సోమవారానికి సెన్సార్ కంప్లీట్ అవుతుందని అనుకుంటున్నా.' అని చెప్పారు. ఈ మూవీ ట్రైలర్‌పై ఏపీ మంత్రి నారా లోకేశ్ ప్రశంసలు కురిపించారు. '1800ల నాటి రాయలసీమను పునఃసృష్టించడంలో చూపిన శ్రద్ధ, అలాగే బ్రిటిష్ వారి కాలంలోని కరువు, అణచివేతతో నిండిన ఆ హృదయవిదారక యుగాన్ని చిత్రీకరించిన తీరు అద్భుతం.' అంటూ ట్వీట్ చేశారు. దీనికి విజయ్ థాంక్స్ చెబుతూ రియాక్ట్ అయ్యారు. 'లోకేష్ అన్న. సీమ గడ్డ నాకు ఎంతో ఇచ్చింది. అందుకే ఈ సినిమా చేయడం నా బాధ్యతగా భావించా. మీ సందేశం మా అందరిలోనూ ఎంతో ఉత్సాహాన్ని నింపింది. మీ కోసం ఒక గొప్ప సినిమా అనుభవం వేచి ఉంది. మన ప్రాంతం, మన ప్రజల పట్ల గర్వపడేలా చేసే చిత్రం ఇది. మీకు నా ప్రేమపూర్వక నమస్కారాలు. అలాగే, మీ ఆప్యాయమైన మాటలకు ధన్యవాదాలు.' అంటూ రాసుకొచ్చారు. ఈ మూవీకి రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వం వహించగా... రణబాలిగా విజయ్ దేవరకొండ, ఆయన భార్య జయమ్మగా రష్మిక మందన్న నటించారు. బ్రిటిష్ దొరగా నెగిటివ్ రోల్‌లో ఆర్నాల్డ్ ఓస్లో కీలకపాత్ర పోషించారు. టి సీరిస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యర్నేని, వై రవిశంకర్ నిర్మిస్తున్నారు. అక్టోబర్ 16న వరల్డ్ వైడ్‌గా తెలుగుతో పాటు తమిళం, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది.



## ప్రోత్సహించడం నేర్చుకోండి

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో 'డైలాగ్ కింగ్' సాయికుమార్ వారసుడిగా అడుగుపెట్టి తనకంటూ ప్రత్యేక గుర్తింపును ఏర్పరుచుకున్నారు యంగ్ హీరో ఆది సాయికుమార్ .. 2011లో 'ప్రేమ కావాలి' చిత్రంతో అరంగేట్రం చేసి, మొదటి సినిమాతోనే ఫిలింఫేర్, సైమా అవార్డులను అందుకున్న ఆయన 'లవ్లీ', 'సుకుమారుడు', 'శమంతకమణి', 'ఆపరేషన్ గోల్డ్‌ఫిష్', 'శశి', 'టాప్ గేర్' వంటి విభిన్న చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తూ వచ్చారు. ఇటీవల విడుదలైన 'శంబాల' చిత్రంతో భారీ విజయాన్ని నమోదు చేసుకుని కెరీర్ పరంగా సరికొత్త ఊపును సొంతం చేసుకున్నారు. అయితే తాజాగా సోషల్‌మీడియాలో ఆయన చుట్టూ ఒక ఆసక్తికరమైన చర్చ నడిచింది. తెలుగు చలనచిత్ర పరిశ్రమలో 'డైలాగ్ కింగ్' సాయికుమార్ వారసుడిగా అడుగుపెట్టి తనకంటూ ప్రత్యేక గుర్తింపును ఏర్పరుచుకున్నారు యంగ్ హీరో ఆది సాయికుమార్ .. 2011లో 'ప్రేమ కావాలి' చిత్రంతో అరంగేట్రం చేసి, మొదటి సినిమాతోనే ఫిలింఫేర్, సైమా అవార్డులను అందుకున్న ఆయన 'లవ్లీ', 'సుకుమారుడు', 'శమంతకమణి', 'ఆపరేషన్ గోల్డ్‌ఫిష్', 'శశి', 'టాప్ గేర్' వంటి విభిన్న చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తూ వచ్చారు. ఇటీవల విడుదలైన 'శంబాల' చిత్రంతో భారీ విజయాన్ని నమోదు చేసుకుని కెరీర్ పరంగా సరికొత్త ఊపును సొంతం చేసుకున్నారు. అయితే తాజాగా



సోషల్‌మీడియాలో ఆయన చుట్టూ ఒక ఆసక్తికరమైన చర్చ నడిచింది. ఈ ఎమోజీల పోస్ట్‌ను ఉటంకిస్తూ ఓ నెటిజన్ ఆది సాయికుమార్ కెరీర్‌ను వ్యక్తిగతంగా కించపరిచేలా తీవ్రమైన వ్యాఖ్యలు చేశాడు. "నేను చిన్నప్పుడు నిక్కర్లు వేసుకున్నప్పటి నుంచి చిత్ర పరిశ్రమలో ఉన్నావు. ఇప్పుడు నేను ఎదిగి ప్యాంట్లు వేసుకునే స్థాయికి వచ్చినా నువ్వు మాత్రం అక్కడే ఆగిపోయావు. కనీసం నిన్నకాక మొన్న వచ్చిన యూట్యూబర్ మౌళికి ఉన్న మార్కెట్ కూడా నీకు లేదు" అంటూ దారుణంగా ట్రోల్ చేశాడు. వ్యక్తిగతంగా దూషిస్తూ చేసిన ఆ వ్యాఖ్యలకు ఆది సాయికుమార్ ఏమాత్రం సహనం కోల్పోకుండా, ఎంతో హుందాగా, ఆలోచింపజేసేలా బదులిచ్చారు. 'ప్రతి హీరో ప్రయాణం వెనుక ఒక కథ, ఎవరికీ తెలియని తీవ్రమైన పోరాటం దాగి ఉంటాయి.

Printed, Published & Owned by Margam Rama on behalf of ADUGU DIGITAL MEDIA Pvt. Ltd, Printed and Published at ADUGU PRESS, H No: 7-120, PALAKURTHI Village & Mandal, Jangaon District, Telangana, PIN: 506146. Chief Editor: Dr.Margam Lakshmi Narayana, Ph.No. : 8499990005

సమగ్ర తెలుగు దినపత్రిక
అడుగు
The Step Towords The Truth..

# గుప్తానంతర యుగం (క్రీ.శ.550-750)

**క్రీ.శ. ఆరవ శతాబ్దం మధ్యభాగంలో గుప్త సామ్రాజ్యం అంతమై మరోసారి భారత చరిత్రలో రాజకీయ అనైక్యత చోటుచేసుకుంది. దీనిని ఆసరాగా చేసుకొని కొన్ని స్వతంత్ర రాజ్యాలు భారతదేశంలో వెలిశాయి. అవి పుష్యభూతి రాజ్యం, కామరూప రాజ్యం, గౌడ రాజ్యం, పల్లవరాజ్యం, బాదామి చాళుక్యులు. ఇందులో మనం ముఖ్యంగా పుష్యభూతి రాజ్యం, బాదామి చాళుక్యులు మరియు పల్లవా రాజ్యం గురించి చర్చిస్తాము.**

### పుష్యభూతి రాజ్యం:

వీరు స్థానేశ్వర్ (ప్రస్తుత హర్యానా ప్రాంతం) రాజధానిగా ఉత్తర భారతదేశాన్ని పరిపాలించారు. మహారాజ పుష్యభూతిని ఈ వంశ స్థాపకుడిగా చెప్పవచ్చు. ఇతను గుప్తులకు సామంతుడిగా ఉండి గుప్త సామ్రాజ్యం విచ్చినమైన వెంటనే స్వతంత్రాన్ని ప్రకటించుకున్నాడు. ఇతని తర్వాత ప్రభాకరవర్ధనుడు రాజ్యానికి వచ్చాడు. ఇతను మహారాజాధిరాజ అనే బిరుదును తీసుకున్నాడు. ప్రభాకరవర్ధనుడు మరణించిన తర్వాత అతని మొదటి



కుమారుడైన రాజ్యవర్ధనుడు రాజ్యాన్ని చేజిక్కించుకున్నాడు. ఇతడు గౌడ రాజ్యం (ప్రస్తుత బెంగాల్ ప్రాంతం) మరియు బీహార్ ప్రాంతంపై దండెత్తి మౌఖరి రాజ్యాన్ని పాలిస్తున్న గృహవర్మను చంపి కనోజ్ (ప్రస్తుత ఉత్తరపదేశ్) ను ఆక్రమించుకున్నాడు. ఇతని తర్వాత పుష్యభూతి రాజ్యంలో అత్యంత గొప్పవాడు మరియు సుప్రసిద్ధుడు హర్షవర్ధనుడు రాజ్యానికి వచ్చాడు.

### హర్షవర్ధనుడు (క్రీ.శ.605-647):

ఇతను ప్రభాకరవర్ధనుడి రెండవ కుమారుడు. మొదటి కుమారుడైన రాజ్యవర్ధనుడు మరణించిన తర్వాత సింహాసనాన్ని అధిష్ఠించి సుదీర్ఘ కాలం పరిపాలించాడు. రాజపుత్ర, శీలాధిత్య అనే బిరుదులను పొందాడు. హర్షవర్ధనుడు ప్రజాసంక్షేమం కొరకు అనేక కార్యక్రమాలు మరియు పేదలకు వైద్యశాలలు నిర్మించాడు. ప్రతీ 5 సంవత్సరాలకు ఒకసారి దానధర్మ అనే కార్యక్రమాన్ని నిర్వహించి తన సంపదలో కొంత భాగాన్ని పేద ప్రజలకు పంచిపెట్టేవాడు. బెంగాల్, బీహార్, గుజరాత్, అస్సాం, ఒరిస్సా ప్రాంతాలను జయించి ఉత్తర భారతదేశంలోనే అత్యంత బలమైన సామ్రాజ్యాన్ని నిర్మించాడు. హర్షవర్ధనుడు రాజ్యాన్ని విస్తరించే క్రమంలో దక్కన్ ప్రాంతాన్ని పాలిస్తున్న బాదామి చాళుక్యులలో ముఖ్యుడైన పులకేశి–II తో యుద్ధం చేసి ఓడిపోయాడు. రెండవ పులకేశి వేసిన తన ఐహోలు శాసనంలో హర్షవర్ధనుడిని ఓడించానని చెప్పుకున్నాడు. హర్షవర్ధనుడు కవి మరియు సాహిత్యంలో ఆరితేరినవాడు. ఇతను స్వయంగా కవులను కూడా పోషించాడు. హర్షవర్ధనుడు సంస్కృతంలో నాగానందం, రత్నావళీ, ప్రియదర్శి అనే నాటకాలు రచించాడు. ఇతని ఆస్థానకవి అయిన భానుడు హర్షచరితను రచించాడు. దీనితోపాటు పార్వతీ పరిణయం మరియు కాదంబరి అనే కావ్యాలుకూడ రచించాడు. హర్షవర్ధనుడు మొదట్లో శైవమతాన్ని ఆచరించాడు. కానీ క్రీ.శ.643వ సంవత్సరంలో కనోజ్ లో జరిగిన సర్వమత సమ్మేళన సభకి అధ్యక్షత వహించిన చైనా నుంచి వచ్చిన బౌద్ధ యాత్రికుడు హుయాన్ త్సాంగ్ యొక్క ప్రభావంతో శైవ మతాన్ని వీధి మహాయాన బౌద్ధమతాన్ని స్వీకరించాడు.
ఇతని తర్వాత పుష్యభూతి రాజ్యం గురించి సమాచారం లేదు.

### బాదామి చాళుక్యులు (క్రీ.శ.540-750):

ప్రస్తుత కర్ణాటకలోని బాదామీ రాజధానిగా సుమారు 210 సంవత్సరాలు దక్కన్ ప్రాంతాన్ని పరిపాలించారు. వీరికి మరొక పేరు వాతాపి చాళుక్యులు. ఈ వంశస్థాపకుడిని పులికేశి – I చెప్పవచ్చు. ఇతను అశ్వమేధ యాగాన్ని నిర్వహించాడు. ఇతని తర్వాత రెండవ పులకేశి రాజ్యానికి వచ్చాడు.

### పులకేశి – II (క్రీ.శ.610-645)

ఇతను బాదామి చాళుక్య వంశంలో అత్యంత గొప్పవాడు మరియు సుప్రసిద్ధుడు. తన తండ్రి పులకేశి మరణించే సమయంలో ఇతను మైనర్ కావడంతో రెండవ పులకేశి యొక్క చిన్నాన్న మంగళేశుడు సంరక్షకుడిగా పరిపాలన నిర్వహించాడు. రెండవ పులకేశి యుక్త వయసులో వచ్చిన తర్వాత కూడా మంగళేశుడు పరిపాలన అధికారాలను ఇవ్వకపోవడంతో అంతర్యుద్ధం కొనసాగింది. ఆ యుద్ధంలో రెండవ పులకేశి తన చిన్నాన్న మంగళేశుడినీ ఓడించి అధికారాన్ని హస్తగతం చేసుకున్నాడని ఐహోలు శాసనంలో క్లుప్తంగా వివరించబడింది. రెండవ పులకేశి మైసూర్ను పాలిస్తున్న పశ్చిమ గాంగులను ఓడించాడు. కొంకన్ ప్రాంతాన్ని పాలిస్తున్న మౌర్యులను ఓడించి ఎలిఫెంటా గుహలను ఆక్రమించుకున్నాడు. ఇది ప్రస్తుతం మహారాష్ట్రలో ఉంది. ఇందులోని అత్యంత సుప్రసిద్ధమైన త్రిమూర్తి గుహాలయమును యునెస్కో ప్రపంచ వారసత్వ కేంద్రంగా గుర్తించింది. ఇతను ఉత్తర భారతదేశాన్ని పాలిస్తున్న హర్షవర్ధనుడిని ఓడించి తన రాజ్యాన్ని ఉత్తరాన నర్మదా నది వరకు విస్తరింపజేశాడు. ఇతను కంచి రాజధానిగా పాలిస్తున్న పల్లవులపై రెండుసార్లు దండెత్తాడు.
1. క్రీ.శ.630లో జరిగిన పుల్లలూరు యుద్ధంలో పల్లవరాజైన మహేంద్ర వర్మ – I ను చంపి అనేక ప్రాంతాలను స్వాధీనం చేసుకున్నాడు.
2. క్రీ.శ.642లో జరిగిన మణిమంగళ యుద్ధంలో పల్లవరాజైన నరసింహవర్మ –I చేతిలో ప్రాణాలు కోల్పోయాడు. పులకేశిని చంపి నరసింహవర్మ –I వాతాపికొండ అనే బిరుదును తీసుకున్నాడు. ఈ సమయంలో బాదామి చాళుక్యులు తమ రాజ్యాన్ని కోల్పోయి పల్లవులకి సామంతులుగా కొనసాగారు.
ఇతని తర్వాత రెండవ పులకేశి కుమారుడైన విక్రమాదిత్య–I పల్లవులతో నిరంతరంగా 12 సంవత్సరాలు పోరాడి రాజ్యాన్ని తిరిగి సాధించుకున్నాడు. ఇతను కంచిపై దండెత్తి మహేంద్రవర్మను చంపి కంచి రాజ్యాన్ని ధ్వంసం చేశాడు. ఇతని తరువాత రెండవ విక్రమాదిత్యుడు రాజ్యానికి వచ్చాడు. బాదామి చాళుక్యులలో ఇతను చివరివాడు మరియు ప్రముఖుడు. మూడుసార్లు పల్లవరాజ్యంపై దండెత్తి కంచి ప్రాంతాన్ని ధ్వంసం చేశాడు. పల్లవులు మరియు బాదామి చాళుక్యుల నిరంతర యుద్ధాలతో బాదామి చాళుక్యరాజ్యం మరియు పల్లవరాజ్యం చాలా బలహీనపడ్డాయి. దీనిని ఆసరాగా చేసుకుని బాదామి చాళుక్యుల దగ్గర గవర్నర్గా పనిచేస్తున్న దంతి దుర్గుడు బాదామి రాజైన కీర్తివర్మ – II ను అంతం చేసి రాష్ట్రకూట రాజ్యాన్ని స్థాపించాడు.

### పల్లవ రాజ్యం (క్రీ.శ.6-9వ శతాబ్దం):

కంచి రాజధానిగా (ప్రస్తుత తమిళనాడు) దక్షిణ



భారతదేశాన్ని మూడు శతాబ్దాల పాటు ఏక చక్రాధిపత్యంగా పాలించిన ఘనత కేవలం పల్లవులకు మాత్రమే దక్కుతుంది. సింహవిష్ణును ఈ వంశస్థాపకుడిగా చెప్పవచ్చు. ఇతను వైష్ణవ మతాన్ని ఆచరించాడు. ఇతని తరువాత మహేంద్రవర్మ–I రాజ్యానికి వచ్చాడు. ఇతను మొదట్లో జైన మతాన్ని ఆచరించి తరువాత తిరునవక్కరసు ప్రభావంతో శైవ మతానికి మారాడు. తను సంస్కృతంలో మత్తవిలాస ప్రహసనము అనే హాస్య నాటికను రచించాడు. మత్తవిలాసప్రహసనము అనగా మద్యం తాగి హాస్యం చేయడం. ఇతను పుల్లలూరు యుద్ధంలో రెండవ పులకేశి చేతిలో 630వ సంవత్సరములో మరణించాడు. ఇతని మరణం తరువాత మొదటి నరసింహవర్మ పల్లవ రాజ్యానికి రాజు అయ్యాడు.

### నరసింహవర్మ–I :

ఇతని కాలంలోనే చైనా బౌద్ధయాత్రికుడైన హుయాన్ త్సాంగ్ కంచి ప్రాంతాన్ని సందర్శించాడు. క్రీ.శ.642లో మణిమంగళ యుద్ధంలో రెండవ పులకేశిని అంతం చేసి వాతాపికొండ మరియు మహామల్ల అనే బిరుదులను పొందాడు. మహాబలి పురం అనే కొత్త రాజధానిని తమిళనాడులో నిర్మించి మహాబలి అనే బిరుదును సొంతం చేసుకున్నాడు. ఇతని తరువాత ఇతని కుమారుడైన మహేంద్రవర్మ–II రాజ్యానికి వచ్చి కేవలం రెండేళ్లు మాత్రమే పాలించాడు. బాదామి చాళుక్య రాజైన విక్రమాదిత్య చేతిలో మరణించాడు. ఇతని తరువాత రెండవ నరసింహవర్మ పల్లవ రాజ్యానికి రాజు అయ్యాడు.

### నరసింహవర్మ–II :

ఇతని కాలంలో కంచి రాజ్యం పాలన విషయంలో మంచి అభివృద్ధిని సాధించింది. ఇతను వ్యాపార అభివృద్ధి కొరకు మరియు ద్వైపాక్షిక చర్చలకు చైనాకు బృందాన్ని పంపాడు. ద్రవిడ శైలిలో అనేక ఆలయాలను నిర్మించాడు. ఇతను నిర్మించిన ఆలయాల్లో తీర దేవాలయం మరియు కైలాసనథ ఆలయం ముఖ్యమైనవి. ఇతను హిందూ మతానికి సంబంధించిన ఘటికలను నిర్మించాడు. దక్షిణ భారతదేశంలో హిందూ దేవాలయాలకు అనుబంధంగా పనిచేసే వేద పాఠశాలలను ఘటికలు అంటారు. (ఇస్లాం మతానికి సంబంధించిన పాఠశాలలను మదరసాలు అంటారు.) రెండవ నరసింహవర్మ తరువాత రెండవ నందివర్మ రాజ్యానికి వచ్చాడు. ఇతను వైష్ణవ మతాన్ని ఆచరించాడు. (పల్లవ వంశంలో పల్లవ రాజ్య స్థాపకుడైన సింహవిష్ణు మరియు రెండవ నందివర్మ మాత్రమే వైష్ణవ మతాన్ని ఆచరించారు. మిగిలిన వారందరూ శైవ మతాన్ని ఆచరించారు.) రెండవ నందివర్మ అశ్వమేధ యాగమును చేశాడు. ఇతని తరువాత పల్లవులలో చివరివాడైన అపరాజితవర్మ రాజ్యానికి వచ్చాడు. కంచికి పక్కనే ఉన్న తంజావూరును పాలిస్తున్న ఆదిత్య చోళుడు అంతం చేసి చూడ సామ్రాజ్యాన్ని స్థాపించాడు.



బానోత్ కళ్యాణ్

## రాజ్యాంగ సంస్థలపై నమ్మకం లేదా..?

### వారి ఓటములకు ఈసీని నిందిస్తారా..!?
### రాజ్యాంగ సంస్థల విశ్వసనీయతపై దెబ్బే
### రాజకీయ స్వలాభం కోసం ఈసి టార్గెట్
### కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం

న్యూఢిల్లీ, అక్టోబర్ 10(అడుగు న్యూస్): కాంగ్రెస్ పార్టీ, ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ రాజ్యాంగ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీయడమే ఏకైక అజెండాగా పెట్టుకున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. తన రాజకీయ ప్రయోజనాలకు అనుకూలంగా తీర్పులు లేదా నిర్ణయాలు వస్తే వాటిని ప్రజాస్వామ్యబద్ధమైనవని పొగడటం, ప్రజలు తిరస్కరించినప్పుడు అవే సంస్థలను అవినీతిమయమని ఆరోపించడం రాహుల్ గాంధీకి అలవాటుగా మారిందని విమర్శించారు. ఈ మేరకు న్యూఢిల్లీలో కిషన్ రెడ్డి ఒక పత్రికా ప్రకటన విడుదల చేస్తూ కాంగ్రెస్ వైఖరిపై నిప్పులు చెరిగారు. ఎన్నికల్లో వరుస పరాజయాలను జీర్ణించుకోలేక రాహుల్ గాంధీ ఎన్నికల సంఘంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని కిషన్ రెడ్డి మండిపడ్డారు. రాహుల్ గాంధీ నాయకత్వంపై నమ్మకం లేకే దేశ ప్రజలు ఎన్నికల్లో కాంగ్రెస్ను పదే పదే తిరస్కరిస్తున్నారని కిషన్ రెడ్డి అన్నారు. రాహుల్ గాంధీని గెలిపించడమో లేదా ప్రధానమంత్రిని చేయడమో ఎన్నికల సంఘం బాధ్యత కాదని, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించడమే దాని విధి అని స్పష్టం చేశారు. ఓట్లు సంపాదించడం, ప్రజా మద్దతు పొందడం పూర్తిగా నాయకుడి బాధ్యత అని, అందులో రాహుల్ ఘోరంగా విఫలమయ్యారని ఎద్దేవా చేశారు. రాజ్యాంగబద్ధమైన తీర్పులు తమకు అనుకూలంగా రాకపోతే సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు విశ్వసనీయతను సైతం శంకించడం కాంగ్రెస్ నైజమని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. రాఫెల్ ఒప్పందంపై కాగ్ నివేదిక కాంగ్రెస్ రాజకీయ ఆరోపణలకు మద్దతు ఇవ్వలేదనే కారణంతో దాన్ని చౌకీదార్ ఆడిటర్ జనరల్ అంటూ గేలి చేశారని ఆక్షేపించారు. ఐఐటీలు, ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్స్టిట్యూట్, కేంద్రీయ విశ్వవిద్యాలయాలు వంటి అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలతో పాటు, భారత సైన్యాన్ని సైతం రాజకీయ లబ్ధి కోసం కించపరిచేలా రాహుల్ వ్యవహరించారని మండిపడ్డారు. సొంత రాజకీయ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు రాహుల్ గాంధీ విదేశీ గడ్డలను, అంతర్జాతీయ వేదికలను ఉపయోగించుకుంటూ దేశ ప్రతిష్టను దిగజారుస్తున్నారని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. భారతదేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థలు, ఆర్థిక వ్యవస్థ కుప్పకూలాయంటూ విదేశాల్లో దుష్ప్రచారం చేయడం ద్వారా దేశంలోకి వచ్చే పెట్టుబడులను, అభివృద్ధిని దెబ్బతీసే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. గతంలో కాంగ్రెస్ హయాంలో తీసుకువచ్చిన ఆర్డినెన్స్ను మీడియా ముందే చించివేసి అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ను రాహుల్ అవమానించారని, మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు భౌతికకాయానికి సైతం కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో గౌరవం దక్కలేదని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. "భారతదేశం ప్రజాస్వామ్య దేశం.. మీ కుటుంబం పాలించాల్సిన రాచరికం కాదు. ప్రజలు తిరస్కరించిన తీర్పును గౌరవించడమే అసలైన ప్రజాస్వామ్య స్ఫూర్తి" అని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. అంబేద్కర్ అందించిన రాజ్యాంగం ప్రకారం.. దేశం, ప్రజాస్వామ్యం ఎల్లప్పుడూ నిలబడతాయని.. అవినీతి, కుటుంబ పాలనను భారత ప్రజలు ఎప్పటికీ మళ్లీ రానివ్వరని ఆయన తేల్చిచెప్పారు.

## పోలీసులపై ఆగ్రహించిన ఆదివాసి గిరిజనులు

ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 10:
పోలీసులపై ఆదివాసి గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేశారు తమపై దురుసుగా ప్రవర్తించి తమ జాతిని కించపరచాలని ఆగ్రహంతో నేరుగా దాడికి దిగారు వాహనంను పూర్తి ధ్వంసం చేసి పోలీసులను తీవ్రంగా గాయపరిచారు. పోలీసు వహానం పై రాళ్లు, కర్రలతో దాడి చేశారు. వాహనం నుం చి లాగి చితక బాదారు. పోలీసులకు సహకరించిన ఇ ద్దరూ అటవీ శాఖ బేస్ క్యాం పు సిబ్బందికి సైతం దేహాశు ద్ధి చేశారు. ఆదిలాబాద్ జిల్లా మారుమూల సిరికొండ మం డలం వాయిపేట గ్రామంలో పోలీసులపై ఆదివాసి గిరిజ నులు దాడి చేశారు. ఆది వాసి గిరిజనులపట్ల కించ ప రిచే వ్యఖ్యలు చేసినందుకు ఈ దాడి జరిగినట్లు ప్రధాన కారణంగా తెలుస్తోంది. దా డిచేసిన వాయిపేట గ్రామ స్తుల కథనం ప్రకారం వివ రాలు ఇలా ఉ న్నాయి. శుక్ర వారం గ్రామ సమీపంలో ని వసిస్తున్న ఓ మహారాజ్ ను గంజాయి సాగు చేస్తున్నా డంటూ పోలీసులు ఆయను పట్టుకొని తీసుకెళ్లారు. ఆ యన వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకుని కేసున మోదు చేసి అరెస్టు చేసి రి మాండ్ సైతం తరలించారు. ఇదిలా ఉండగా మరుసటి రోజు శనివారం ఇచ్చోడ రూరల్ సీఐ రమేష్ సిరికొండ ఐఎస్ఐ జాదవ్ బలిరాం, పోలీసు సిబ్బంది శివప్రసా ద్, సిఐ గన్ మెన్ గంగారాం వాయిపేట్ గ్రామానికి విచారణనిమిత్తం వెళ్లారు. వా యిపేట గ్రామానికి చేరుకు న్న కొద్దిసేపు ఆగి సీఐ, ఏ ఎ స్ ఐ అక్కడ ఉన్న ఆదివాసి గిరిజన యువకులను గంజాయితో పట్టబడిన మహా రాజ్ గురించి విచారించే క్ర మంలో వారి పట్ల దురుసు గా ప్రవర్తిస్తూ కించపరిచే వి ధంగా వ్యాఖ్యలు చేసి మ హారాజు నివసించే ప్రాంత మైన బంగారిగూడ ప్రాంతా నికి విచారణ నిమిత్తం వె ళ్ళారు. ఈ కార్యక్రమాన్ని ముగించుకొని తిరిగి వస్తుం డగా వాయిపేట లో ఆది వాసి గిరిజన యువకులు, కొందరు మహిళలు సిఐ ని నిలదీసేందుకు కాపు కాసి ఉ న్నారు. ఈ విషయాన్ని పసి గట్టిన సీఐ వాహనాన్ని డ్రై వర్ చాకచక్యంగా తప్పించు కు నేందుకు మరో మార్గం గుండా కుంటగూడా గ్రామం వైపు వాహనాన్ని వేగంగా తీ సుకెళ్లాడు. ఇది గమనించిన వాయుపేటి గ్రామానికి చెంది న మహిళలు, యువకులు వారు పారిపోతున్నారని ఆ వాహనాన్ని వెంబడించారు. కుంట గూడ గ్రామ సమీపం లో మరో దారి ఆయనకు తెలియకపోవడం వల్ల అక్కడే వాహనాన్ని నిలిపివేశారు. సీఐ, సిబ్బంది జీబు నుంచి బయటకు రాకుండా జీపు డోర్లకు లాకులు వేసి లోపలే ఉండిపోయారు. ఆగ్రహిం చి న యువకులు కర్రలతో రాళ్ల తో వాహనంపై దాడి చేసి ధ్వంసం చేశారు. దీంతో వా హనం నుంచి బయటకు వ చ్చిన సీఐ, సిబ్బంది మళ్లీ ఆ యువకుల పట్ల దురుసుగా, కించపరిచే విదంగా ప్రవ ర్తించారు. దీంతో మళ్లీ ఆగ్ర హించిన ఆ యువకులు సి బ్బంది తో సహా సీఐని తీవ్రం గా కొట్టారు. సిఐ రివాల్వర్ ను లాక్కునే ప్రయత్నం చేశారు. నన్ను చంపండి కానీ రివాల్వర్ ను ఏమాత్రం ము ట్టుకోవద్దని ప్రాదేయ పడి వే డుకోవడంతో వదిలేశారు. వారిని తీవ్రంగా కొట్టి వాయి పేట గ్రామానికి తీసుకొచ్చా రు. ఒక ఇంటి వద్ద కూర్చో బెట్టి ఎస్పీ కి ఫోన్ చేశారు. ఎస్పీ అఖిల్ మహాజన్ కు జరిగిన సంఘటనను ఆది వాసి గిరిజనులందరూ వివ రించారు. సిఐని సిబ్బందిని ఎందుకు కొట్టాల్సి వచ్చిందో పూర్తిగా వివరించారు. ఇక నుంచి అలా జరగకుండా చూస్తానని, వారిని వదిలే యండి అని అని ఎస్పీ హా మీ ఇవ్వడంతో వెంటనే వా రిని వదిలేశారు. అప్పటికే వాయిపేట్ గ్రామానికి చేరు కోవడానికి పెద్ద ఎత్తున చేరు కున్న పోలీసు బలగాలు సై తం వెనక్కి మళ్లాయి. దీంతో పరిస్థితి సద్దుమణిగింది. గా యాలైన సిఐ రమేష్ని, ఏ ఎ స్ ఐ జాదవ్ బలిరాం సిబ్బం ది శివ ప్రసాద్, బీంరావు, గంగారాం లను పోలీసులు ఆదిలాబాద్ రిమ్స్ కు చికి త్స నిమిత్తం తరలించారు. ధ్వంసమైన పోలీసు వాహ నాన్ని సిరికొండ పోలీస్ స్టేష న్ కు తరలించారు. ఇదిలా ఉండగా దీనికి ముందు ఆది వాసి గిరిజనుల సమాచా రాన్ని పోలీసులకు చేర వే స్తున్నారని నేఫంతో ఇద్దరు అటవీ శాఖకు చెందిన బేస్ క్యాంపు సిబ్బందికి కూడా దే హాశు ద్ధి చేశారు. బేస్ క్యాం పు సిబ్బంది నవీన్, సూర్య కాంత్ లను కూడా ఆ ఆది వాసి గిరిజనులు దేహ శుద్ధి చేసి వదిలేశారు.



## సౌదీపై మరోసారి హౌతీల దాడి..!

న్యూఢిల్లీ, అక్టోబర్ 10(అడుగు న్యూస్): సౌదీ అరేబియా రాజధాని రియాద్లోని కింగ్ ఖలీద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై మరోసారి దాడి జరిగింది. శనివారం జరిగిన ఈ దాడితో అధికారులు ఎయిర్పోర్ట్ను ఖాళీ చేయించి, విమాన రాకపోకలను నిలిపివేశారు. రెండు రోజుల క్రితం జరిగిన దాడిలో పైలట్తో సహా ముగ్గురు సౌదీ పౌరులు మరణించిన నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకోవడం తీవ్ర కలకలం రేపుతోంది. విమానాశ్రయానికి విమానాల రాకపోకలు పూర్తిగా ఆగిపోయాయని ఇద్దరు ప్రాంతీయ అధికారులు మీడియాకు తెలిపారు. రాజధానిలో కనీసం రెండు భారీ పేలుళ్లు వినిపించాయని రియాద్ నివాసి అహ్మద్ సయ్యద్ ఏపీ వార్తా సంస్థకు చెప్పారు. ప్రయాణికులు తమ విమాన సర్వీసుల సమాచారం కోసం ఎయిర్లైన్స్ను సంప్రదించాలని విమానాశ్రయ అధికారులు సూచించారు. పొరుగున ఉన్న యెమెన్లో ఇరాన్ మద్దతున్న హౌతీ తిరుగుబాటుదారులపై సౌదీ నేతృత్వంలోని సంకీర్ణం భారీ సైనిక చర్య ప్రారంభించినప్పటి నుంచి ఈ విమానాశ్రయంపై పలుమార్లు దాడులు జరిగాయి. బుధవారం జరిగిన దాడికి తామే బాధ్యులమని హౌతీలు ప్రకటించారు.

## గెలిస్తే నిజాయతీ.. ఓడితే అవకతవకలా?

న్యూఢిల్లీ, అక్టోబర్ 10(అడుగు న్యూస్): ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అక్రమాలు జరిగాయంటూ దిల్లీలో ప్రతిపక్షాలు, పౌర సమాజ సంఘాలు ఆందోళనలు నిర్వహిస్తున్న వేళ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఒకవైపు దీనికి నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్ చేస్తుంటే, ఎన్నికల సంఘం అలాగే సర్ ప్రక్రియకు మద్దతు ప్రకటించారు మాజీ ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు. భారత ఎన్నికల సంఘం నిష్పాక్షికతను, అలానే భారత ఎన్నికల విధానాన్ని సమర్థిస్తూ దేశానికి చెందిన 124 మంది మాజీ ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారుల బృందం ఒక బహిరంగ లేఖను విడుదల చేసింది. ఎలాంటి సరైన ఆధారాలు లేకుండా ఓట్ల చోరీ జరిగిందని, ఎన్నికల రిగ్గింగ్ అని ఆరోపణలు చేయడం సరికాదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. తగిన సాక్ష్యాధారాలు లేకుండా ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ఆరోపించడం వల్ల ప్రజాస్వామ్య సంస్థలపై దేశ ప్రజలకు ఉన్న విశ్వాసం దెబ్బతింటుందని అన్నారు. ఆరోపణలకు విశ్వసనీయమైన ఆధారాలు ఉండాలని, అంతేకానీ నిరాధారంగా ఎన్నికలు రిగ్గింగ్కు గురయ్యారని ప్రచారం చేయడం ప్రమాదకరమని హెచ్చరించారు. దిల్లీలో శనివారం సీఈసీ రాజీనామాను డిమాండ్ చేస్తూ, ఆయనకు వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో పాల్గొనేందుకు ప్రయత్నించిన పలువురు ప్రతిపక్ష నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిలో నలుగురు మాజీ ముఖ్యమంత్రులు కూడా ఉన్నారు. ఈ క్రమంలోనే సివిల్ సర్వెంట్ల బృందం లేఖ విడుదల చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. తాము ఏ రాజకీయ పార్టీకి చెందినవారము కాదని మాజీ అధికారులు లేఖలో స్పష్టం చేశారు. తమ ఉద్యోగ జీవితంలో ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితా తయారీ, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్ల పర్యవేక్షణ వంటి బాధ్యతలను ఎన్నో సార్లు నిర్వహించామని గుర్తుచేశారు. 'అసలు ఎలాంటి ఆధారాలు లేకుండా మన ఎన్నికలను రిగ్గింగ్ అంటూ ఒక పదాన్ని పదేపదే ఉపయోగిస్తున్నారు. ప్రతిసారీ అలా అనడం ప్రజాస్వామ్యంపై మనందరికీ ఉన్న నమ్మకాన్ని దెబ్బతీస్తుంది' అని లేఖలో పేర్కొన్నారు. ఎన్నికల్లో గెలిచినప్పుడు అదే వ్యవస్థ నిజాయతీగా ఉందని, అదే ఓటమి ఎదురైనప్పుడు అక్రమాలు, అవకతవకలకు పాల్పడిందని చెప్పడం సరికాదని మాజీ అధికారులు ఈ సందర్భంగా లేఖలో ప్రస్తావించారు. 'వ్యవస్థపై మీకు అనుమానమా? లేక ఫలితంపైనా?' అని ప్రశ్నిస్తూ, తగిన ఆధారాలేం లేకుండా తప్పుడు కథనాలను ప్రచారం చేయడం వల్ల ప్రజాస్వామ్యం దెబ్బతింటుందని అన్నారు. ఎన్నికల నిర్వహణలో వచ్చిన మార్పులకు 2025 బిహార్ అసెంబ్లీ ఎన్నికలను ఉదాహరణగా మాజీ అధికారులు పేర్కొన్నారు. బిహార్ చరిత్రలోనే తొలిసారిగా అక్కడ ఒక్క రీపోలింగ్ కూడా అవసరం లేకుండా ఎన్నికలు పూర్తయ్యాయని, 1951 తర్వాత అత్యధిక ఓటింగ్ శాతం నమోదైందని తెలిపారు. మహిళలు కూడా రికార్డు స్థాయిలో ఓటు హక్కు వినియోగించుకున్నట్లు లేఖలో గుర్తుచేశారు. అధికారులు పూర్తిగా మారిపోయినందువల్లే ఇది సాధ్యమైందని కాదని, ఎన్నికల సంఘం రూపొందించిన వ్యవస్థలో పర్యవేక్షణ, జవాబుదారీతనం ఉండటమే ఇందుకు కారణమని వివరించారు. ఇక ఈవీఎంలు, స్ట్రాంగ్రూమ్ల భద్రత గురించి ప్రస్తావించిన మాజీ అధికారులు– ప్రతి అభ్యర్థి తరఫున ఏజెంట్లు పోలింగ్ కేంద్రంలో జరిగే ప్రక్రియను గమనించగలరని, పోలైన ఓట్ల లెక్కకు సంబంధించిన సంతకం చేసిన వివరాల్ని కూడా అందుకుంటారని తెలిపారు. అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలోనే ఈవీఎంలను సీల్ చేస్తారని, ఆ సీల్స్పైనా వారి సంతకాలు ఉంటాయని వివరించారు. తర్వాత యంత్రాలను స్ట్రాంగ్రూంలో భద్రపరుస్తారని, అభ్యర్థులు లేదా వారి ప్రతినిధులు వాటి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.